ఆదివారం
ప్రజాశక్తి
23 డిసెంబర్, 2001

ఉగ్రవాద సవాలు ఉద్రిక్త స్వరాలు

చదవండి! చదివించండి!!

నిజాన్ని నిర్భయంగా చాటేది
ప్రజల పక్షాన నిలిచేది

ప్రజాశక్తి
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతిల నుండి ప్రచురణ.





మీ ఇంట్లో ఉంటూనే ఉచితంగా డ్రాయింగ్ నేర్చుకోండి!

ఉచితం 5 డ్రాయింగ్ కోర్సులు

1. ఈజీ డ్రాయింగ్ కోర్స్
2. ఈజీ కార్టూన్ కోర్స్
3. ఈజీ అనాటమీ కోర్స్
4. జామెట్రికల్ ఆర్ట్ కోర్స్
5. కమర్షియల్ ఆర్ట్ కోర్స్

ఈ కోర్స్ ఫ్రీగా పొందటం ఎలా?

1. మీ పేరు, చిరునామా కూపన్‌లో స్పష్టంగా రాయాలి. ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌నే పంపాలి. జిరాక్సులు అంగీకరించబడవు. 2. ఈ ఫ్రీ కోర్స్ సులభ ఇంగ్లీష్ లో ఉంటుంది. 3. దీని తర్వాత రాబోయ్యే కొత్త కోర్సులు కూడా మీకు పంపిస్తాము. ఇవి మీకు తప్పక ఉపయోగపడతాయనేది మా నమ్మకం. 4. కూపన్‌లోని నిబంధనలు వర్తిస్తాయి. 5. ఈ స్కీమ్‌లో యాజమాన్య నిర్ణయమే ఫైనల్.

192 పేజీలు... 2000 బొమ్మలు (స్టెప్స్‌తో కలుపుకుని) మీకు డ్రాయింగ్ నేర్పుతాయి. **ఉచితం**



ఈ కూపన్ పూరించి వెంటనే పొందండి. 2043

5 ఫ్రీ డ్రాయింగ్ కోర్సులు మరియు 192 పేజీలు (2000 బొమ్మలు) కేవలం పోస్ట్, ప్యాకింగ్ మరియు అడ్వర్టైజింగ్ ఖర్చులు నిమిత్తం నాకు రూ.100/- కి మాత్రమే వి.పి.పి ద్వారా పంపండి. పోస్ట్‌మెన్‌కి పైకం చెల్లించి తీసుకుంటాను.

KVR INSTITUTE
No.124, G.N.Chetty Road,
T.Nagar, Chennai - 600 017.

Name --
Address --

-- Pincode:

చొరవ

ఈ మధ్య ఓ దూరపు బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళాను. వాళ్ళు మా అమ్మకు ఎక్కడో బీరకాయ పీచు సంబంధం. అమ్మ ఒత్తిడితోనే ఆ పెళ్ళికి బయలుదేరా. తీరా అక్కడికి వెళితే నాకు తెలిసిన వాళ్ళు ఒక్కళ్ళూ కనిపించలేదు. ముందుగా పెళ్ళివారి దగ్గరికి వెళ్ళి మా కుటుంబం తరఫున నేను వచ్చినట్లు హాజరు వేయించుకున్నాను. అమ్మ నాన్నల్లో ఎవ్వరూ రానందుకు ముందు నిష్టూరం వేసినా నేనయినా వచ్చినందుకు సంతోషించారు. భోజనాల హాలు చూపించి ముందు భోజనం చేసిరమ్మని చెప్పి వాళ్ళ పనిలో వాళ్ళు నిమగ్నమయ్యారు. భోజనాల దగ్గర విపరీతమైన రద్దీగా ఉంది. ఆ తొక్కిసలాటలో ఏం భోంచేస్తాంలే అని పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాను. ఇంతలో మాపిన్ని కొడుకు రాజు ఎప్పుడు వచ్చాడోగాని భోజనాల దగ్గర హడావిడి చేస్తూ కనిపించాడు. వడ్డన చేస్తూ జోకులు పేలుస్తున్నాడు. వాళ్ళుకూడా బాగ ఎంజాయ్ చేస్తున్నారు. నాకు తెలిసినంత వరకు వాడికి ఇక్కడ ఇంతకు ముందు పరిచయం ఉన్న వారెవరూ లేరు. అప్పుడే పరిచయాలు చేసుకోవడం అయిపోయిందన్న మాట. వాడు ఎవరితోనయినా ఇట్టే కలిసిపోతాడు. చొరవ చాలా ఎక్కువ.

మనలో మాట

మావాడే మరొకడున్నాడు. ఒట్టి బద్ధకస్తుడు. ఎప్పుడూ మన్ను తిన్న పాములా పడి ఉంటాడు. తన చుట్టూ ప్రపంచం తల్లక్రిందులయినా ఏ మాత్రం స్పందించడు. అసలు తన పనులు తాను చేసుకోవడానికే ఒళ్ళు వంచడు. ఇక ఇతరుల గురించి ఆలోచించడం, మాట్లాడటం ఎక్కడ చేస్తాడు? చిన్నప్పటి నుండీ వాడంతే. చదువులోనూ అస్తు బిస్తు మార్కులే. చివరికి ఏదో తంటాలు పడి డిగ్రీ అయిందనిపించాడు. ఉద్యోగమూ అంతే. ఎదుగూ బొదుగూ లేని గుమాస్తాగిరి. వాడి భార్య వాడికన్నా తెలివైంది, చురుకైంది కావడంతో పిల్లలు మాత్రం వాడి బాపతు కాదు. పిల్లలు కూడ వాడిలా తయారు కాకుండా ఉండటానికి ఆమె తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. తాను మాత్రం మా వాడితో సర్దుకుపోతూ సతమతమయిపోతూ ఉంటుంది.

మా ఆఫీసులో వీరిద్దరికీ భిన్నమయిన మరో తరహా వ్యక్తి ఉన్నాడు. అతగాడి పేరెందుకు లెండి. అతి చొరవ గాడు. అయిన దాంట్లోనూ, కాని దాంట్లోనూ తనకు సంబంధం ఉన్నా లేకపోయినా తల దూరుస్తూ ఉంటాడు. అన్నీ తనకే తెలుసనీ, తనకున్న వ్యవహార శైలి, నిర్వహణా దక్షత ఇతరులెవ్వరికీ లేవని అతనికి గట్టినమ్మకం లేదంటే గుడ్డి నమ్మకం. అందువల్లనే ఇతరుల పనుల్లో తరచూ కల్పించుకుంటూ ఉంటాడు. పై వాళ్ళతో చీవాట్లు కూడ అదే మోతాదులో తింటూ ఉంటాడు. తన పనిలోనయినా రాణిస్తాడా అంటే అదీ ఉండదు. ముందు నీ పనయినా సక్రమంగా చేయవయ్యా అనే హితోక్తులను ఎంత మాత్రం పట్టించు కోడు. పైపెచ్చు తన బహుముఖ ప్రజ్ఞను వీళ్ళెవరూ ఉపయోగించుకోలేక పోతున్నారని తెగ చింతిస్తూ ఉంటాడు.

అతి చొరవకు, అసలు చొరవ లేకపోవడానికి తేడా ఇప్పుడు అర్థమయిందనుకుంటాను. మరి నిజమైన చొరవ ఎలా ఉంటుంది? వీరు అవసరాన్ని బట్టి స్పందిస్తారు. ఆ అవసరాన్ని ముందుగా గుర్తించడం, దానికి అనుగుణంగా కార్య రంగంలోకి దూకడంలో వీరి చొరవ ప్రస్ఫుటమవుతుంది. అనవసరమైన హడావిడికి, ఆర్భాటానికి వీరు ఆమడ దూరంలో ఉంటారు. తమకు అప్పగించిన పనిని ఎంత సమర్థవంతంగా పూర్తిచెయ్యాలి, ఎంత వేగంగా పూర్తి చెయ్యాలి, సృజనాత్మకతను మేళవించి మెరుగైన ఫలితాలను ఎలా రాబట్టాలి అనే విషయాల పైనే తమ దృష్టినంతా కేంద్రీకరిస్తారు. తమ పనిలో రాణించడం ద్వారానే ఇతరులకు ఆదర్శంగా ఉండాలని భావిస్తారు తప్ప ఎదుటి వారి పనిలో జోక్యం చేసుకొని తమ గొప్పతనాన్ని చాటుకోవాలని ఎంత మాత్రం ప్రయత్నించరు. ముందు తమ పరిధిలోని విషయాలు లోతుగా పరిశీలించడం, క్షుణ్ణంగా అవగాహన చేసుకోవడమే మొత్తం సంస్థను లేదా వ్యవస్థను అవగాహన చేసుకోవడానికి తొలిమెట్టని దృఢంగా విశ్వసిస్తారు. ఇటువంటివారే ఏరంగంలోనయినా ముందుకు దూసుకు పోతారు. నిజమైన చొరవ అంటే వీరిదే. నిజమైన చొరవ గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే 'కర్తవ్య నిష్ఠ'.అదే అసలు సిసలు చొరవ.

చెప్పేదొకటి... చేసేదొకటా! ...10



చరిత్రకెక్కిన క్రీస్తు మందిరం మెదక్ చర్చి 16

మళ్ళీ స్వర్ణయుగం వైపుగా హాకీ ...! ... 17

ప్రభాత భేరీలు మోగించిన మహిళాషాట్ ...21

ఇంకా ....

ఆరోగ్యం	... 6, 7
బాలలకథ	... 11
బాలనేస్తాలు	... 12, 13
కచేరి	... 14
ఇంతిసంగతులు	... 15
కథ	... 18, 19
అథాలత్ కథలు	... 22, 23
పలుకుబడి	... 24

వగైరా ....

ఉగ్రవాద సవాలు - ఉద్రిక్త స్వరాలు

తెలకపల్లి రవి



"బీభత్స రస ప్రధానం- పిశాచ గణ సమ వాకారం" అంటూ మహాకవి రాసిన వర్ణన వర్తమాన ప్రపంచానికి పూర్తిగా వర్తించుతుంది. న్యూయార్క్ నుంచి న్యూఢిల్లీ వరకు ఒకే విధమైన ఘటనలు, ఒకే విధమైన ప్రతి స్పందనలు చూడటం ఆశ్చర్యం అనిపించినా నిజానికది వర్తమాన వాస్తవ ప్రతిబింబమే.

డబ్ల్యు.టి.సి.పై దాడి తదనంతరం ఆఫ్ఘన్ యుద్ధం, ఇంతలోనే పాలస్తీనాపై తిరిగి ఇజ్రాయిల్ దాడులు, ఇరాక్‌పై దాడికి సన్నాహాలు - ఈ అంతర్జాతీయ నేపథ్యంలో భారత పార్లమెంటుపై కనీవినీ ఎరుగని టెర్రరిస్టు దాడి! ఈ దాడి పూర్వాపరాలు తేలకుండానే ఆక్రమిత కాశ్మీర్‌పై దాడి చేస్తామంటూ యుద్ధ వాతావరణం సృష్టించిన వాజ్‌పేయి సర్కారు.

జరుగుతున్న దేమిటో, ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా స్పందించాలో సగటు మనిషి తేల్చుకోక ముందే ప్రకటనల యుద్ధాలు, రాజకీయ లబ్ధికై ఆరాటాలు, ప్రభుత్వమూ, ప్రధాన ప్రతిపక్షమూ కూడా రెండు రకాలుగా మాట్లాడే అవకాశవాద పోకడలు, ఏక ధృవ ప్రపంచాధిపత్యం తనకు తానే చేపట్టిన అమెరికా కూడా రకరకాలుగా మాట్లాడుతూ గందరగోళం పెంచుతున్న స్థితి. నిజంగానే ఇది దేశ చరిత్రలో క్లిష్టమైన సమయం.

తెహల్కా టేపుల నిందితుడు జార్జి ఫెర్నాండెజ్ రక్షణ మంత్రిగా వుండరాదని ప్రతిపక్షాలు నిరసన తీవ్రం చేస్తుండగానే శవపేటికల భాగోతం, కాగ్ నివేదిక వెల్లడై వాతావరణాన్ని వేడెక్కించాయి. దీని నుంచి ప్రభుత్వం ఎలా బయట పడుతుందని అందరూ చూస్తుండగా హఠాత్తుగా పార్లమెంటుపై దాడి జరిగింది.

ఇంతకు తెగించిందెవరు? దేశ అధికార వ్యవస్థకు కేంద్ర బిందువైన పార్లమెంటులోకి వారెలా ప్రవేశించగలిగారు? రెండు మూడు రోజులలోనే సాక్ష్యాధారాలు దొరికాయని, పాకిస్తాన్ కేంద్రంగా గల లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ ఇందుకు కారణమని ప్రభుత్వం చెప్పడం ప్రారంభించింది. బిజెపి నాయకులే గాక మంత్రులు కూడా పోటీ పడి ఉద్రిక్త స్వరంతో మాట్లాడ్డం మొదలెట్టారు. ప్రధానిని మించి పోయి హోంమంత్రి అద్వానీ ఆ బాధ్యత చేపట్టారు. పార్లమెంటుపై దాడి జరగనున్నట్టు నెల కిందటే తమ దృష్టికి వచ్చిన సమాచారాన్ని కేంద్రానికి తెలియజేశామని మహారాష్ట్ర ప్రభుత్వం వెల్లడించడంతో సమస్య మరో మలుపు తిరిగింది.

ఈ పరిస్థితులలో కేంద్ర ప్రతినిధులు భద్రతా వైఫల్యానికి దారి తీసిన కారణాలపై కేంద్రీకరించాలి. ఆ క్రమంలోనే సాక్ష్యాధారాలు సేకరించి దోషులెవరో తేల్చాలి. వారి వెనక విదేశీ హస్తముంటే ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వేదికపై సాక్ష్యాలు సమర్పించి అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి. కానీ జరుగుతున్నది వేరు. చాలా కాలంగా పథకం సిద్ధం చేసుకుని, నేరుగా పార్లమెంటు సముదాయంలో ప్రవేశించి అంతటి బీభత్సం సృష్టించడానికి అవకాశమిచ్చినందుకు ఇసుమంత విచారం లేకపోగా, ప్రాణాలర్పించిన భటుల శౌర్య పరాక్రమాలను తమ ఖాతాలో వేసుకుని ఊరేగుతున్న కాషాయ కూటమి నేతలను ఏమనాలి? పైగా దీన్ని రాజకీయంగా వాడుకోవడానికి కేంద్ర సచివులంతా అర్జెంటుగా టూర్లు జరుపుతున్నారు.

ఉగ్రవాద చర్యలకు సుదీర్ఘ చరిత్ర

భారత దేశంలో టెర్రరిస్టు చర్యలు చాలా కాలం కిందటే ప్రారంభమయ్యాయి. 1954లో నాగాలాండ్‌లో మొదటి టెర్రరిస్టు దురాగతం జరిగిందని చెబుతుంటారు. కాని నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది లోపునే మహాత్మాగాంధీని హిందూ మతోన్మాదులు బలి గొన్న ఘటన కూడా ఈ కోవకు చెందినదే. అసలు టెర్రరిజం అంటే ఏమిటనే దానిపై రకరకాల నిర్వచనాలు వున్నాయి. "రాజకీయమైన, మత పరమైన సైద్ధాంతిక లక్ష్యాలు సాధించడం కోసం బల ప్రయోగం లేదా బల ప్రయోగం చేస్తామని బెదిరించడం అందుకోసం బెదిరింపులు, నిర్బంధం, భయోత్పాతం కలిగించడం" అని టెర్రరిజాన్ని అమెరికా సైనిక మాన్యువల్ నిర్వచించింది. ఇది కూడా సమగ్రమైనది కాదు. దీని ప్రకారం పరోక్ష యుద్ధాలు, తక్కువ స్థాయి యుద్ధాలు ఈ నిర్వచనంలోకి రావు. అలాగే రాజకీయ ముసుగులో మతాన్ని వాడుకోవడం కూడా తప్పించుకుపోతుంది. గాంధీజీ హత్యను కొంతమంది టెర్రరిజం కింద పేర్కొనకపోవడానికి కారణమిదే. అది గాడ్సే వ్యక్తి గత ఉన్మాదమైనట్టు మాట్లాడుతుంటారు. కాని అతని వెనక హిందూ మతోన్మాద ముందని, ఇటీవలనే గాడ్సే సోదరునికి

అరలక్ష మందిని బలిగొన్న "ఉగ్ర భారతం"

భారత దేశం ఉగ్రవాదం వల్ల చాలా నష్టపోయింది. 1948 జనవరి 30 న జాతిపిత హత్య నుంచి లెక్క వేస్తే ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో సహా ఎందరో ప్రముఖులు బలయ్యారు. ఇక సామూహిక బలి విషయానికొస్తే ఇప్పటి వరకు అరలక్ష మంది ఉగ్రవాదానికి బలై వుంటారని ఒక అంచనా. ఇందులో పెద్ద భాగం కాశ్మీర్, పంజాబ్‌లదే. బస్సులను ఆపి సామూహికంగా వధించడం వంటి ఘటనలు నాడు సర్వసాధారణం. రైళ్లలో పేలుళ్ల దహనకాండలో పీపుల్స్‌వార్ గ్రూపు కూడా బీభత్సం సృష్టించింది. అస్సాంలో నెల్లి మారణహోమం, బీహార్‌లో అనేక కుల కాష్టాలు కూడా ఈ కోవలోవే. బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత ఈ ప్రమాదం మరింత పెరిగింది. 1993 ముంబాయి ప్రేలుళ్లు, అదే ఏడాది రాష్ట్రపతి భవన్ దగ్గర్లో సంభవించిన ప్రేలుడులో పదిమంది బలి, 1998లో కోయంబత్తూరులో ప్రేలుడులో 48 మంది మృతి, 2001 డిసెంబరులో ఎర్రకోటపై లష్కరే దాడి, ఈ ఏడాది కాశ్మీర్ అసెంబ్లీపై దాడి వంటి ఘటనలన్నీ సంచలనం కలిగించాయి. ప్రార్థనా స్థలాలు కూడా ఈ ఉగ్రవాదుల చొరబాటుతో ఉద్రిక్తమయ్యాయి. దేశంలో 46 రైల్వే స్టేషన్లు ఉగ్రవాదుల దాడులకు లక్ష్యంగా వున్నాయని నివేదికలు చెబుతున్నాయి. గాంధీజీ హత్యకు ముందు ఒక విఫల యత్నం జరిగిన తర్వాత పోలీసుల ఇంటరాగేషన్‌లో అనేక వివరాలు ముందే వెల్లడైనాయి. మహారాష్ట్ర నుంచి వాటిని ఢిల్లీ పంపినా ఆయన హత్యను నివారించే శ్రద్ధ లోపించింది. పార్లమెంటుపై దాడి పథకం గురించి కూడా మహారాష్ట్ర నుంచి ముందుగానే సమాచారం అందింది. అద్వానీ ఆ విషయం డిసెంబరు 5న ఫిక్కి సమావేశంలో వెల్లడించారు. అంతేగాని ఆ సమాచారాన్ని ప్రతిపక్షాలతో పంచుకోవాలని గాని, వ్యవస్థను అప్రమత్తంచేయాలని గాని అనుకోలేదు! భద్రత గురించి ఎంతో మాట్లాడే ఈ నేతలు వాస్తవంలో ఎంత అజాగ్రత్తగా, అసమర్థంగా వుండేది కార్గిల్ ఘర్షణలో వలెనే ఈ సందర్భంలోనూ వెల్లడవడం గమనార్హం.

డిశంబరు13 ...గడియారం ఇలా తిరిగింది....

ఉదయం 11 - యథావిధిగా పార్లమెంట్ ఉభయసభల సమావేశం
11:05 - కార్గిల్ శవపేటికలపై ప్రతిపక్షాల నినాదాలు
11:10 - ఉభయసభల వాయిదా
11:20 - అఖిలపక్షనేతలతో స్పీకర్ మంతనాలు
11:30 - ఉపరాష్ట్రపతి కార్యాలయానికి చేరిన కృష్ణకాంత్
11:40 - వేగంగా దూసుకువచ్చిన కారులో ఐదుగురు తీవ్రవాదులు పార్లమెంట్‌లో ప్రవేశం
11:42 - పార్లమెంట్‌లో కాల్పుల గురించి పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్లు
11:44 - సిఆర్‌పిఎఫ్, ఐటిబిటి పోలీసుల రంగప్రవేశం
11:45 - సెక్యూరిటీ ఆఫీసరు మృతి, పార్లమెంట్ భవనం గేట్లు సీలువేత, పార్లమెంట్ సభ్యులనందరినీ సెంట్రల్ హాలుకు తరలింపు
11:45 - ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద భారీ పేలుడు, ఒంటినిండా బాంబులు పెట్టుకున్న తీవ్రవాది మృతి
11:48 - ఎనిమిది, 11నంబరు గేట్ల ముందు హోరాహోరీ కాల్పులు
11:55 - తొమ్మిదవ గేటు ముందు ముగ్గురు తీవ్రవాదులు సిఆర్‌పిఎఫ్ జవాన్ల చేతుల్లో మృతి
12:00 - ఐదవనంబరు గేటు ముందు మరో తీవ్రవాది కాల్చివేత
12:20 - కాల్పులు పూర్తిగా నిలుపుదల
12:40 - నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోల ప్రవేశం
1:00 - ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటన
1:05 - సైన్యంతో సహా పోలీసుల ప్రవేశం
1:40 - పరిస్థితి అదుపులో ఉన్నట్లు ఉన్నత భద్రతాధికారుల నిర్ధారణ
2:05 - సెంట్రల్ హాలులోని పార్లమెంట్‌సభ్యుల తరలింపు
2:45 - బాంబ్‌డిస్పోజల్ స్క్వాడ్ ప్రవేశం
3:50 - ప్రధానద్వారం ముందున్న మానవబాంబు శరీరం మీది బాంబులు పేలకుండా డిఫ్యూజ్ చేశారు
4:05 - తీవ్రవాదులుపయోగించిన కారులో బాంబులను పేలకుండా చేశారు

పార్లమెంట్ ఆవరణలో ఆత్మాహుతిదళం కదలికలు

1.ఎర్రరంగు లైటు, హోంమంత్రిత్వశాఖ స్టిక్కర్, పార్లమెంట్ పాస్‌తో తెల్లరంగు అంబాసిడర్ కారు (డిఎల్3సిజె1527) విజయ్‌చౌక్ మీదుగా పార్లమెంట్‌లోకి ప్రవేశం

2.తీవ్రవాదులు ఉపరాష్ట్రపతి ఉపయోగించే రెండవనంబరు గేటు వైపు మళ్లారు

3.ఉపరాష్ట్రపతి కాన్వాయ్ డ్రైవర్‌తో ఘర్షణ

4.గోడను చాటుచేసుకుని నలుగురు తీవ్రవాదులు తుపాకులు గ్రనేడ్లతో గేట్లముందర ప్రత్యక్షం

5.ఉపరాష్ట్రపతి భద్రతా సిబ్బంది అప్రమత్తం కావటంతో ముగ్గురు 8వగేటు, ఒకరు 5వగేటు, ఒకరు మెయిన్ గేటు వైపు పరుగుతీశారు.

6.మానవబాంబు రెండుచేతుల్లో రెండు రివాల్వర్‌లతో కాల్పులు జరుపుకుంటూ ఒకటవనంబరు గేటు మెట్లు ఎక్కాడు. వాచ్‌అండ్‌వార్డ్ సిబ్బంది సమయస్ఫూర్తితో తలుపులు మూశాడు.

7.ఎనిమిదవ గేటువద్ద, ఐదవ గేటు వద్ద కాల్పుల తీవ్రత పెరిగింది. చివరకు 20 నిమిషాల తర్వాత నలుగురు భద్రతా సిబ్బంది తుపాకీ గుళ్లకు బలయ్యారు

ఎవరు...ఎక్కడ

☆ ప్రధాని - వాజ్‌పేయి తన నివాసం రేస్‌కోర్స్‌రోడ్7లో మదనలాల్ ఖురానాతో సమావేశంలో ఉన్నారు. ఉభయసభలు [illegible] వార్త విని పార్లమెంట్ ప్రయాణాన్ని వాయిదావేసుకున్నారు.

☆ సోనియాగాంధీ - లోక్‌సభ వాయిదా పడగానే తన నివాసం జనపథ్ 10కి వెళ్లిపోయారు

☆ అద్వానీ- పార్లమెంట్‌లో తన కార్యాలయంలో శవపేటికల వివాదం విషయమై న్యాయశాఖ మంత్రి అరుణ్‌జైట్లీతో చర్చిస్తున్నారు.

☆ ఫెర్నాండెజ్ - ఉభయసభలు వాయిదా పడ్డాక పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రమోద్‌మహాజన్ రూంకు వస్తున్నారు

☆ జి.ఎం.సి బాలయోగి - ప్రతిపక్ష నేతలతో ఒకసారి చర్చించి మరికొందరిని కలిసేందుకు పార్లమెంట్ ఎనెక్స్‌కు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు.

☆ సోమనాథ్ ఛటర్జీ - స్పీకర్‌తో చర్చించిన అనంతరం లోక్‌సభలోని 134 నంబరు రూంలో గల సిపిఐఎం పార్లమెంటరీ పార్టీ కార్యాలయానికి వెళ్తున్నారు.

– కె.వీరయ్య, న్యూఢిల్లీ

సన్మానం చేసారని మరచిపోగలమా?

ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటు వాద శక్తులు అడపాదడపా సాగించే ఉగ్రవాద చర్యలు ఆరవ దశకం చివరలో నగ్జలైట్ తీవ్రవాదం మినహా ఇండియా ఈ సమస్యను పెద్దగా ఎదుర్కోలేదు. కాని 1980 లలో పంజాబ్‌లో ఖలిస్తాన్ తీవ్రవాదం ఒక్కసారిగా ప్రజ్వరిల్లి అల్లకల్లోలం సృష్టించింది. ఇంచుమించు అదే సమయంలో జమ్ము కాశ్మీర్‌లో ఇందిరాగాంధీ రాజకీయ దుస్సాహసంతో ఫరూక్ అబ్దుల్లాను గద్దె దించి షాను కూచోబెట్టడంతో అక్కడ పాక్ ప్రేరిత ఉగ్రవాదం తీవ్రతరమైంది. గత రెండు దశాబ్దాల నుంచి కాశ్మీర్ ఉగ్రవాదం ఆరని చిచ్చుగా వుంది. పంజాబ్‌లో ఖలిస్తాన్ తీవ్రవాదం అయిదేళ్ల పాటు అల్లకల్లోలం సృష్టించడమే కాక ఇందిరాగాంధీని కూడా బలి తీసుకుంది. అక్కడ శాంతి కొంతవరకు పునరుద్ధరించడం చాలా కాలానికి గాని జరగలేదు. ఈ ఉగ్రవాదులకూ పాకిస్తాన్ సహాయం వున్నట్లు అనేకసార్లు రుజువైంది.

అయితే పంజాబ్, కాశ్మీర్ ఉగ్రవాదులకు పాకిస్తాన్ సహాయం గురించి మాత్రమే చెప్పి అమెరికా పాత్రను విస్మరించడం పొరబాటవుతుంది. ఈశాన్య భారతంలో వేర్పాటు వాదం కోసం "ప్రాజెక్టు బ్రహ్మపుత్ర" అంటూ రూపొందించింది. జనతా ప్రభుత్వం వచ్చిన కొత్తలో అస్సాంలో వేర్పాటు వాదం ప్రబలింది. తాత్కాలిక రాజకీయం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు అస్సాం, పంజాబ్ వేర్పాటు వాదాలకు వత్తాసు నిచ్చారు.. ఎనిమిదవ దశకంలోనే శ్రీలంకలో ప్రారంభమైన తమిళ జాతీయుల సంక్షోభం ఇండియాకూ పాకింది. ఎల్‌టిటిఇ తదితర తీవ్రవాద గ్రూపులు తమిళనాడులో తిష్టవేశారు. వీరికీ మొదట కాంగ్రెస్, రాష్ట్రంలోని అన్నా డిఎంకె మద్దతు నిచ్చాయి. తర్వాత ఎల్‌టిటిఇ రాజీవ్‌గాంధీని హత్య చేసింది. ఇలా దేశంలో పాలక వర్గాల అవకాశవాదం,బయట నుంచి సామ్రాజ్యవాదం కలసి ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ వచ్చాయి. ఇండియాకు వ్యతిరేకంగా అస్థిరీకరణ చర్యలు సాగించడానికే అమెరికా పాకిస్తాన్ సైనిక పాలకులను ప్రోత్సహించుతూ వచ్చింది. ఖలిస్తాన్ నినాదం ప్రారంభించిన జగజిత్‌సింగ్ చౌహాన్ అమెరికా ఖండం నుంచి తర్వాత బ్రిటన్ నుంచి పనిచేశాడు. కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ కేంద్ర కార్యాలయం కూడా చాలా కాలంపాటు లండన్‌లోనే వుండేది. కాశ్మీర్ సమస్యను ఐరాస వేదికపై ఆరని చిచ్చులా అట్టిపెట్టడంలో అమెరికాది ప్రధాన ప్రాపు.కాశ్మీరీ యోధుల మానవ హక్కులను గౌరవించాలంటూ క్లింటన్ భారత ప్రభుత్వానికి లేఖ రాశారు కూడా.

డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి మృతదేహాలు

అమెరికా పాత్ర

అసలు అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని రగిలించడంలో అమెరికా పాత్ర ను తెలుసుకుంటే తప్ప ఈ పరిణామం అర్థం కాదు. సోవియట్ యూనియన్‌కు సోషలిస్టు దేశాలకు వ్యతిరేకంగా ప్రచ్ఛన్న యుద్ధం పేరిట ప్రత్యక్ష యుద్ధం

సాగించిన కాలంలోనే అమెరికా తనకు గిట్టని తనతో లేని దేశాలలో ఉగ్రవాద వేర్పాటు వాద శక్తులను పనిగట్టుకు ప్రోత్సహించింది. సిఐఎకు అనుబంధంగా కోవర్ట్ ఆపరేషన్స్ (రహస్య కార్యకలాపాల విభాగం) అంటూ ఒకటి నడిపించింది. దీని పని ప్రపంచం మూలమూలలా తమకు అనుకూలమైన ప్రభుత్వాలనూ, రాజకీయ శక్తులను ప్రోత్సహించడం, నచ్చనిచోట్ల హత్యలు, కుట్రలు చేయించడం, వాటికి ఆర్థిక రాజకీయ, ఆయుధ సహాయం అందించడం తప్ప మరేమీ కాదు. ఈ క్రమంలోనే అమెరికా సైనిక నియంతలను, మతోన్మాద శక్తులను, ఫాసిస్టులను అందరినీ రెచ్చగొట్టింది. ఆఫ్ఘనిస్థాన్‌లో నాటి ప్రగతి శీల ప్రభుత్వానికి వ్యతిరేకంగానే బిన్‌లాడెన్‌తో సహా తాలిబాన్లనూ పోషించింది. ఆఫ్ఘన్‌లో తన ప్రయోజనాల కోసమే పాకిస్తాన్‌ను ప్రత్యేకంగా దువ్వుతూ ఆ విధంగా భారత భద్రతకు ముప్పు పెంచింది. బిన్‌లాడెన్‌కు ఆర్థిక సహాయం అందించిన విషయం సిఐఎ మాజీ అధినేత విలియం కేసి స్వయంగా అంగీకరించారు. ఇవన్నీ తిరుగులేని వాస్తవాలు. కనుక ఉగ్రవాదం ఇప్పుడే పుట్టినట్టు అందుకు వ్యతిరేకంగా పోరాడటమే అమెరికా ధ్యేయమైనట్టు దాని అండదండలతో మనం ముందుకు పోవచ్చున్నట్టు మాట్లాడటం అంటే ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కు కోవడమే. అంతెందుకు? అఫ్ఘనిస్తాన్‌లో తన యుద్ధావసరాల కోసం అది పాక్ అధ్యక్షుడు ముషారఫ్‌ను ఎంతగా నెత్తినెత్తుకుంది? అమెరికా పర్యటనలో వాజ్‌పేయి కన్నా ఆయనకే ఎలా పెద్ద పీట వేసి ప్రశంసలు కురిపించింది? ఇవన్నీ తెలిసి కూడా వాజ్‌పేయి ప్రభుత్వం అమెరికాను పెద్ద మనిషిగా పరిగణించి దాని ఆమోదంతో అండతో మన దేశానికి భద్రత కల్పించుతామని చెప్పడం హాస్యాస్పదం. అవసరాల మేరకు స్నేహం, అది తీరగానే ద్రోహం అమెరికా నైజం.



బాబ్రీ మసీదు విధ్వంసమూ ఉగ్రవాదమే

1960 లలో వామపక్ష తీవ్రవాదం ప్రధాన సమస్యగా వుంటే 80 ల తర్వాత పరిస్థితి మారింది. జాతులపై ఉగ్రవాదం పెరిగింది. వీటికీ అమెరికా ఆదరణ లభించింది. ఇక 1990లో సోవియట్ విచ్ఛిన్నం తర్వాత అమెరికా అజెండాలో సోవియట్ వ్యతిరేక భాగం స్థానే ఇతర ప్రయోజనాల సాధన ప్రధాన పాత్ర వహించింది. ప్రాంతీయంగా తనకు నచ్చే శక్తులను చేరదీయడం ప్రధానంగా పెట్టుకుంది. సాంకేతికంగా వచ్చిన అభివృద్ధి ఉగ్రవాద ప్రమాదాన్ని ఊహాతీతంగా మార్చివేసింది. మందుపాతరలు, రిమోట్ పేలుడు పదార్థాలు, ఆర్‌డిఎక్స్, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ నెట్‌వర్క్‌లు ఒకటేమిటి రకరకాల ప్రమాదాలు ముంచుకొచ్చాయి. మాఫియాల ప్రాబల్యం చాలా ఉంది. అయితే న్యూయార్క్‌లోనూ, న్యూఢిల్లీ లోనూ కూడా ఆగంతకుల సాంకేతిక నైపుణ్యం కన్నా భద్రతా వ్యవస్థల అలసత్వం ప్రధాన పాత్ర వహించవలసి వుంది.

సామాజిక కారణాలు

ఉగ్రవాదం పెరగడానికి అనేక కారణాలున్నా అందులో అతి ముఖ్యమైనది సామాజిక నైతిక సంక్షోభం. భవితవ్యం అయోమయమైన యువతను దుష్టశక్తులు ఉగ్రవాదం వైపు మరల్చుతున్నాయి. మనిషిలోపలి విధ్వంసం మనిషిని విధ్వంస కుడిగా మార్చేస్తున్నది. ప్రమాదకరమైన అమానుష యంత్రంగా మారిన మనుషులు లేకపోతే ఎంతటి సాంకేతిక నైపుణ్యమూ పనికిరాదు. ఆత్మాహుతికి సిద్ధమైన ఉగ్రవాదిని అరికట్టాలంటే అందుకు శిక్షలు, ఆయుధాలే చాలవు. అంతకు మించిన సామాజిక రాజకీయ వ్యూహం కావాలి.

1990లో అయోధ్య సమస్యను బిజెపి రంగం మీదకు తెచ్చిన తర్వాత పరిస్థితి మరో మలుపు తిరిగింది. అంతకు ముందు నుంచే భజరంగదళ్ , త్రిశూల్‌సేన వగైరా సంస్థలు బయలు దేరాయి. శూలాలు తిప్పుతూ మత నినాదాలతో వాతావరణం ఉద్రిక్తం చేశాయి. అద్వానీ రథ యాత్రతో మత రాజకీయాలు భగ్గుమన్నాయి. ఉత్తర భారతంలో ఎంతోమంది యువకులు మత ప్రేరణతో రెచ్చిపోయి నర్తించడం మొదలు పెట్టారు. 1992 లో బాబ్రీ మసీదు విధ్వంసంతో ఈ దశ పరాకాష్టకు చేరింది. బాంబుతో పేల్చక పోయినా బలప్రయోగంతో ఒక మత స్థలాన్ని కూలగొట్టడం ద్వారా సామూహిక టెర్రరిజానికి మార్గం వేసినట్టయింది. దానికి ప్రతిక్రియగా ఆ తర్వాత ముంబాయి పేలుళ్లు సంభవించాయి. వీటన్నిటిలో మైనార్టీలు పాల్గొన్నారు గనక ముస్లిములంటేనే దేశ వ్యతిరేకులు, ఐఎస్ఐ ఏజంట్లు అని చిత్రించే విపరీత ధోరణి ప్రబలింది. సంఘ పరివార్ మాత్రమే కాక మీడియాలో ఒక భాగం కూడా బాధ్యతా రహితంగా ఇందుకు దోహదపడింది. గతంలో సిక్కులను, హిందువులను మొత్తంగా ఉగ్రవాదులని అనలేదు కాని ముస్లిముల విషయంలో మాత్రం తేలిగ్గా మాట్లాడుతున్నారు. చివరకు ఇది ఒక విష వలయంగా తయారైంది. నిజానికి ఏదో ఒక మతానికి చెందిన వారంతా టెర్రరిస్టులని చిత్రించడం అనుమతించరాని విషయం. చరిత్రలో అన్ని మతాలూ బీభత్స కాండకు పాల్పడిన ఉదాహరణలున్నాయి. **(బాక్స్ చూడండి)**

నేటి వాతావరణంలో టెర్రరిజాన్ని వ్యతిరేకించడం చాలా అవసరమనడంలో ఎలాటి సందేహం లేదు. టెర్రరిస్టు శక్తులను ఎదుర్కోవలసిన అవసరంలోనూ భిన్నాభిప్రాయానికి ఆస్కారం లేదు. కాని ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలుండకూడదు. ఎవరికి వారే తీర్పరులు శిక్షకుల పాత్ర ధరించి యుద్ధ భేరీలు మోగించడం మొదలు పెడితే ఉగ్రవాదం తగ్గడం అటుంచి దేశాలు సామూహిక మారణ హోమాలకు దారి తీయడమే జరుగుతుంది. ఎందుకంటే టెర్రరిజం అనేది పరిమిత యుద్ధమైతే యుద్ధం అనేది లైసెన్సుతో సాగే సామూహిక టెర్రరిజం. టెర్రరిజానికి ప్రజాస్వామిక పరిష్కారాలు వెతకాలి. టెర్రరిస్టులుగా మారుతున్నవారిని జన జీవన స్రవంతిలోకి తేవాలి. అంటే వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యంగా ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలి. గ్రామాలలో భూపంపిణీ చేయాలి. దోపిడీ దారులను దౌర్జన్య పరులను అవినీతి పరులను అడ్డుకొని ప్రజలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలిగించాలి. మెజారిటీ మైనారిటీ సమస్య లేకుండా ఏ మతానికి, కులానికి, ప్రాంతానికి, దేశానికి చెందిన వారికైనా న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలగాలి. అమాయకులపై పోలీసులు గాని, రాజ్య వ్యవస్థగాని నిష్కారణంగా బల ప్రయోగం చేయకూడదు. కాని జరుగుతున్నది అందుకు భిన్నం. దాంతో చట్ట బద్ధ పాలనపైన, భవిష్యత్‌పైన, విశ్వాసం కోల్పోయిన వారు ఉగ్రవాదులుగా మారే అవకాశముంటుంది. పోటో, టాడా వంటి చట్టాలతో నిర్బంధకాండకు తలపడితే వారు మరింత దూరమౌతారు.

★

మతం- ఉగ్రవాదం

1993 ముంబాయి పేలుళ్ళ తర్వాత మన దేశంలో ముస్లిములే ఉగ్రవాదులన్నట్టు మాట్లాడే ధోరణి పెరిగింది. ఇటీవల అమెరికాపై టెర్రరిస్టు దాడి తర్వాత నాగరికతల ఘర్షణ పేరిట దాన్ని ఇస్లాం, క్రైస్తవాల యుద్ధంగా చిత్రించే పోకడలు వచ్చాయి. మామూలుగా ఉదార వాదులుగా వుండే వారిలోనూ కొందరు ఈ ధోరణిలో మాట్లాడటం కనిపిస్తోంది. అయితే తరతరాల చరిత్రను చూసినా తాజా అనుభవాలను చూసినా ఈ విధమైన అభిప్రాయాలు చాలా పొరబాటు. మతాల పేరిట చరిత్ర లో అనేక టెర్రరిస్టు చర్యలు జరిగాయి. వ్యక్తిగతంగానూ సామూహికంగానూ జరిగాయి. కాని అంత మాత్రాన ఆ మతావలంబులందరూ టెర్రరిస్టులే అయినట్టు మాట్లాడటం హాస్యాస్పదం. అప్పుడు ప్రపంచంలో ప్రతి ఒక్కరూ టెర్రరిస్టులనుకోవాలి. ప్రాచీన హిందూ సమాజం కింది కులాలపై అనేక అకృత్యాలు సాగించింది. వేదాలు విన్న శూద్రుల చెవుల్లో సీసం పోయడం అలాటిదే. ఇక రోమన్లు కొత్తగా తలెత్తుతున్న క్రైస్తవంపై ఎన్నో చిత్ర హింసలు సాగించి, తర్వాత దాన్ని అధికారమతంగా స్వీకరించారు. ఇస్లాం పుట్టిన తర్వాత చాలా కాలానికి అంటే గడచిన సహస్రాబ్ది ప్రారంభంలో 1065లో పోప్ మధ్య ప్రాచ్యంలో క్రైస్తవ ప్రదేశాల విముక్తికై క్రూసేడ్ జరపాలని పిలుపిచ్చారు. ఆ విధంగా మూడు క్రూసేడులు జరిగాయి. మత యుద్ధాలతో దేశాలు తల్లడిల్లి పోయాయి. ఆధునిక కాలంలో ఐర్లండులో క్రైస్తవ మతానికే చెందిన ప్రొటెస్టంటు క్యాథలిక్ శాఖల మధ్య ఆగని యుద్ధం సాగుతూనేవుంది. అమెరికాలో ఎనిమిది మంది అధ్యక్షులను ఆ దేశస్తులే ఆ మతాన్ని అనుసరించేవారే హత్య చేశారు. ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ సాదత్‌ను, బంగ్లాదేశ్ నిర్మాత వంగ బంధు ముజిబుర్ రెహమాన్‌ను ఇస్లామిక్ తీవ్రవాదులే హత్య చేశారు. ఆఖరుకు అహింసా మతమైన బౌద్ధానికి చెందిన వారు శ్రీలంక ప్రధాని బండారనాయకేను హత్య చేశారు. గాంధీజీని హిందూ మతోన్మాది, ఇందిరా గాంధీని సిక్కు తీవ్రవాది బలిగొన్నారు. ఒకే మతానికి చెందిన ఇరాక్, ఇరాన్‌లు పదేళ్లు యుద్ధం చేసుకున్నాయి. ఇప్పుడు క్రూసేడ్ అంటున్న అమెరికాయే చమురు సంపన్నమైన గల్ఫ్‌లో తన ప్రయోజనాలు కాపాడుకోవడానికి చిన్న చిన్న షేక్‌డంలను కృత్రిమంగా సృష్టించి కీలుబొమ్మలుగాచేసుకుంది. అందులోనూ ఇస్లామిక్ ఛాందసానికి మారుపేరైన సౌదీ అరేబియా దాని ముద్దుల బిడ్డగా వుంది. యూదు జాత్యహంకార ఇజ్రాయిల్‌ను అమెరికా అల్లారు ముద్దుగా పెంచుతూ పాలస్తీనియన్లపై దాని రాక్షసత్వాన్ని నిస్సంకోచంగా సమర్థించుతుంటుంది. ఇటీవల కూడా ఇజ్రాయిల్‌ను అభిశంసిస్తూ ఐరాస చేసిన తీర్మానాన్ని అది వీటో చేసింది. అదే అమెరికా ఇస్లామిక్ తీవ్రవాదుల పునస్సమీకరణలోనూ ప్రధాన పాత్ర వహించింది. ఎక్కడెక్కడో వున్న వారందరినీ పోగు చేసి ఆఫ్ఘనిస్తాన్ పంపింది. అంతెందుకు? తాలిబాన్లకు ఆఫ్ఘన్ ప్రభుత్వంలో భాగస్వామ్యం వుండాలని అమెరికా, వాజ్‌పేయి కూడా ప్రతిపాదించడం దేనికి నిదర్శనం? సోవియట్ మిత్ర దేశమైనందున ఇండియాను శత్రు జాబితాలో పెట్టి నానా విచ్ఛిన్న శక్తులను ప్రోత్సహించిన అమెరికా ఇప్పుడు సంఘ పరివార్ తనకు లొంగి వుంటోంది గనక అటు పాక్‌తో ఇటు ఇండియాతో డబుల్ గేమ్ ఆడుతోంది. జమ్ముకాశ్మీర్ స్వయంప్రతిపత్తిని వ్యతిరేకించే బిజెపి అందుకోసం డిమాండ్ చేసే నేషనల్ కాన్ఫరెన్సుతో చేతులు కలుపుతోంది. జార్జి ఫెర్నాండెజ్ నామధేయుడు లౌకిక జపం చేస్తూనే క్రైస్తవులపై సంఘపరివార్ హత్యాకాండను కప్పి పుచ్చే బాధ్యత స్వీకరించాడు. ఈ ఉదాహరణలన్నీ చెప్పేదొకటే. రాజకీయ భౌగోళిక ప్రయోజనాలు తప్ప కేవలం మతం కోసం ఏదీ జరగదు. మతాన్ని అడ్డం పెట్టుకునే శక్తులు తప్ప మతాన్ని అనుసరించే అసంఖ్యాకులకు టెర్రరిజంతో నిమిత్తమూ వుండదు.

చెవి వ్యాధులకు ఆధునిక మైక్రో సర్జరీ

డా॥ ఎ.వెంకటరమణారెడ్డి
నెల్లూరు

చెవి, ముక్కు, గొంతు వ్యాధులలో ఎక్కువగా వ్యాధికి గురయ్యే భాగం చెవి. మన శరీర భాగాలలో ఎక్కువ నిర్లక్ష్యం చేసేది కూడా చెవి వ్యాధుల గురించే. ఎందుకంటే చెవి నొప్పి ఉంటే తప్ప పేషెంట్స్ డాక్టర్‌ను సంప్రదించడం లేదు. చెవిలో చీముకారుతుంటే ఏదో ఒక చుక్కల మందులు వేయడం లేదా నాటు పద్ధతుల ద్వారా వైద్యం చేయడం ఇంకా జరుగుతోంది. దీనివలన ఈ చెవి వ్యాధులు ప్రాణాంతకంగా తయారయ్యే అవకాశం కూడా ఉంది. ఈ చెవి వ్యాధులను పూర్తిగా నయం చేసే ఆయుధమే ఈ ఆధునిక మైక్రో సర్జరీ విధానం.

సాధారణంగా చెవి వ్యాధులు ఈ విధంగా ఉంటాయి.

1. చెవిలో చీము కారడం
2. చెవి వినపడక పోవడం
3. తల తిరగడం
4. చెవిలో శబ్దాలు రావడం
5. ముఖ పక్షవాతం
6. చెవిలో గడ్డలు ఏర్పడడం

1. చెవిలో చీము : ఈ చెవిలో చీము రావడం పుట్టిన బిడ్డ దగ్గర నుంచి వందేళ్ళ ముదుసలి వరకు రావచ్చు. కాని చిన్నపిల్లలో ఇది చాలా ఎక్కువగా కనపడుతుంది. చెవిలో చీము రావడం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి చెవి పొర కర్ణభేరికి మధ్యలో రంధ్రం పడి చీము కారుతుంది. దీనిని సురక్షితమైన వ్యాధి అంటారు. నూటికి 90 శాతం కేసులలో ఈ రకం అయిన వ్యాధి కనపడుతుంది. ఈ వ్యాధికి ముఖ్య కారణం జలుబే. మన శరీరంలో చెవిని ముక్కును కలుపుతూ ఈస్ట్రేషియన్ ట్యూబ్ అనే గొట్టం ఉంటుంది. జలుబు ఎక్కువ రోజులు వున్న వారిలో చీము ఈ గొట్టం ద్వారా చెవికి చేరుతుంది. చెవిలో చేరిన ఈ చీము విపరీతమైన చెవిపోటు కలుగచేస్తుంది. దీనిని అక్యూట్ స్టేజ్ అంటారు. ఈ సమయంలో డాక్టర్ని సంప్రదించి సరి అయిన వైద్యం తీసుకుంటే ఇది పూర్తిగా తగ్గిపోతుంది. లేకుంటే ఈ చీము కర్ణభేరికి రంధ్రం వేసుకొని బయటకు వస్తుంది. ఇది చాలా తరచుగా జరుగుతూ ఉంటే దీనిని క్రానిక్ స్టేజ్ అంటారు. ఇలా ఎక్కువ సార్లు చీము కారుతుంటే కర్ణభేరి పూర్తిగా కరిగిపోయే అవకాశం ఉంది. మరొక రకమైన చెవిలో చీము కారు వ్యాధిలో చెవి మధ్యలో కాకుండా చుట్టు పక్కల రంధ్రం పడుతుంది. దీనిని ప్రమాదకరమైన వ్యాధి అంటారు. ఈ ప్రమాదకరమైన చీము వలన చాలా దుష్ఫలితాలు ఉంటాయి. అవి ముఖ్యంగా చెవి వెనుక చీము గడ్డ రావడం, తల తిగడం, ముఖ పక్షవాతం రావడం, మెదడు వాపు రావడం, మెదడులో చీము చేరడం లాంటివి. ఈ వ్యాధికి వెంటనే ఆపరేషన్ చేసి ప్రమాదాన్ని నివారించవచ్చు.

చికిత్సా విధానం

చెవిలో చీము కారుతున్న ప్రతి పేషెంట్ వెంటనే డాక్టర్ని సంప్రదించవలసి ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఈ చీము రావడానికి కారణం గొంతులో టాన్సిల్స్ ఉండడం లేదా ఎప్పుడూ జలుబు చేస్తూ ఉండడం. అటువంటి పిల్లలలో ట్యాన్సిల్స్ వెంటనే ఆపరేషన్ చేసి తీసివేయవలసి ఉంటుంది. కంటిన్యూగా జలుబు వున్నా, సైనసైటిస్ ఉన్నా దానికి కూడా ఎండోస్కోపిక్ సర్జరీ విధానం ద్వారా పూర్తిగా నయం చేయవలసి ఉంటుంది.



చెవికి సంబంధించిన ఆపరేషన్లు :

1. మైరింగో ప్లాస్టీ : చెవి పొరకు వున్న రంధ్రమును వేరొక పొర ద్వారా పూర్తిగా మూసివేయడం.

2. మాస్టాయిడెక్టమీ : చెవి వెనుక వున్న మాస్టాయిడ్ ఎముకలో వున్న చీమును తీసివేయడం.

3. ఆసిక్యులోప్లాస్టీ : వినికిడికి సంబంధించిన ఎముకలను సరి చేయటం.

కొంతమంది పేషంట్లలో ఈ మూడు రకాలైన ఆపరేషన్లు ఒకేసారి చేయవలసి ఉంటుంది.

2. చెవుడు (వినికిడి లోపం) : ముఖ్య కారణాలు మూడు.

(1) చెవిలో చీము కారడం : దీనిని మైక్రో సర్జరీ ద్వారా సరి చేసి వినికిడిని సాధారణ స్థితికి తెచ్చే అవకాశం ఉంది.

(2) ఆటోస్క్లీరోసిస్ : ఈ రకమైన వ్యాధిలో చెవిలో వినికిడికి సంబంధించిన మూడు ఎముకలలో అతి చిన్నదైన స్టేపిస్ అనే ఎముక అతుక్కుపోయి శబ్దాలు లోపలికి వెళ్ళడాన్ని నిరోధిస్తుంది. దీనిని స్టేపిడాటమీ అనే ఆపరేషన్ ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు.

(3) వినికిడి నరం బలహీన పడడం : ఈ రకమైన వ్యాధిని మందులతో గానీ, ఆపరేషన్‌తో గాని సరి చేయడం కుదరదు. దీనిని ఆడియోమెట్రి ద్వారా నిర్ధారించి



డాక్టర్ సలహాల కోసం ప్రశ్నలు పంపండి

ఆదివారం అనుబంధంలో పాఠకుల నుంచి ఆరోగ్య సమస్యలపై ప్రశ్నలు ఆహ్వానిస్తున్నాం. మీ సమస్యలకు నిపుణులైన వైద్యులు పరిష్కారాలు సూచిస్తారు. ప్రశ్నలు సూటిగా, సాధ్యమైనంత క్లుప్తంగా ఉండాలి.

ప్రశ్నలు పంపవలసిన చిరునామా:

సంపాదకులు, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, అశోక్ నగర్, హైదరాబాద్-500 020

హియరింగ్ ఎయిడ్ పెట్టుకోవలసి ఉంటుంది. కాని వినికిడి నరం దెబ్బతిన్న వారికి ఈ వినికిడి నరం సరి చేసే కొత్త శస్త్ర చికిత్సా విధానం యిప్పుడు అమలులోకి వస్తూ ఉంది. దీనిని కాక్లియార్ యింప్లాంట్ ఆపరేషన్ అంటారు. ఇది ఇండియాలో చాలా తక్కువ హాస్పిటల్స్‌లో చేయడం జరుగుతోంది.

(4) తల తిరగడం : ఈ తలతిరుగుడు అనేది చెవి వ్యాధుల వలననే కాకుండా మెదడుకు సంబంధించిన వ్యాధులలో, మెడ ఎముకలకు సంబంధించిన వ్యాధులలో, షుగర్, బి.పి., అనీమియాలో కూడా వస్తుంది. ఇటువంటి రోగులను పూర్తిగా పరీక్షించి కొన్ని రకాలైన పరీక్షల ద్వారా నిర్ధారించవలసి వుంటుంది. చెవి వ్యాధుల వలన వచ్చే తలతిరుగుడు వ్యాధికి కొన్ని రకాలైన ఆధునిక మైక్రో సర్జరీ విధానం ద్వారా సరిచేయవచ్చును. ఈ ఆపరేషన్‌ను ఎండోలింఫాటిక్ శాక్ డికంప్రెషన్ అంటారు.



చెవి వ్యాధులకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు :

1. చెవి తనంతట తానే శుభ్రపరచుకుంటుంది. చెవిలో పిన్నులు, పుల్లలు పెట్టి శుభ్రం చేయడం మంచిది కాదు.
2. చెవి నొప్పి వున్నా, చెవిలో చీము వున్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించవలెను. చెవిలో నూనెలు వేయడం గానీ, ఎటువంటి ద్రావకాలు వేయడం కాని చేయకూడదు.
3. చెవిలో చీముకారుతూ ఉన్నపుడు విపరీతమైన చెవిపోటు వున్నా, జ్వరం వస్తున్నా, తలతిరుగుతూ వున్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించవలెను. లేని ఎడల చీము మెదడుకు చేరి ప్రమాదం కలుగజేసే అవకాశం వుంది.
4. షుగర్ వ్యాధి వున్నవారు చెవి నొప్పిని నిర్లక్ష్యం చేయరాదు. ఇది ప్రమాదకరమైన మాలిగ్నాంట్ ఓట్టిటిస్ ఎక్స్‌టెర్నాగా మారే అవకాశం ఉంది.
5. చెవిలో చీము వున్నా చెవిలోకి నీరు పోకుండా జాగ్రత్త తీసుకొనవలెను. లేని ఎడల షుగర్ వ్యాధులు ఎక్కువ అయ్యే అవకాశం ఉంది.

★

నా వయస్సు 17 సంవత్సరాలు. నా కుడి ఛాతిలో గడ్డ మాదిరిగా ఉంది. నొక్కితే నొప్పి వస్తోంది. ఏ మందు వాడాలో తెలియచేయగలరు.

- మమత, భీంగల్

మీ ఛాతిలోఉన్నది ఫైబ్రో ఎడినోమా కావడానికి అవకాశముంది. మీరుసర్జన్‌ను సంప్రదించి జబ్బు నిర్ణయం చేసుకోవాలి. జబ్బు నిర్ణయం అయిన తరువాత ఆపరేషన్ ద్వారా తొలగించుకోవడానికి వీలుంటుంది.

డాక్టరు ఎస్. విజయరాఘవరావు,

ఎంఎస్, (జనరల్) డిఆర్థో, విజయ హాస్పటల్,

అరవై అడుగుల రోడ్డు, ఒంగోలు.

★ ★ ★

మా బాబు పసివాడు. నాకు పని చేసే వాళ్ళు ఎవరూ లేరు. నేనే చేసుకోవాలి. అందరూ చల్లని నీళ్ళల్లో చేతులు పెట్టవద్దు, తలకు గుడ్డకట్టాలి, దూది పెట్టుకోవాలి అంటున్నారు. లేకపోతే ఇప్పుడు కాదు, రేపు పెద్దయిన తరువాత ఉంటుంది అని అంటున్నారు. కాళ్ళకు తిమ్మిర్లు వస్తాయి. బాలింతలో వచ్చిన జబ్బు బతికినంత కాలం ఉంటుందని అంటున్నారు. దయ చేసి సలహా ఇవ్వండి.

- నాగలక్ష్మి

మిమ్మల్ని భయపెడుతున్న అంశాలలో ఒక్కదానిలో కూడా వాస్తవం లేదు. మీరు ఏమీ భయపడకుండా అన్ని పనులూ చేసుకోవచ్చు. మీరు భయపడుతున్నవి, మీకు చెప్పినవాళ్ళు అంటున్నవి అన్నీ కూడా ఏ మాత్రం శాస్త్రీయ ఆధారం లేని మూఢ విశ్వాసాలు.

నాకు ఎక్కువగా జలుబు వుంటుంది. వర్షం, చలి రోజుల్లో ఎక్కువవుతుంది. పది లేక పదిహేను రోజులకొకసారి గొంతు నుండి బియ్యం ముక్క లాంటిది పడుతుంది. చాలా చెడ్డవాసన వస్తుంది. డాక్టర్లకు చూపించి ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. మీరు నా సమస్యకు సరైన సలహా ఇచ్చి తగు మందులు సూచించవలసిందిగా కోరుతున్నాను.

- ఎస్.సంధ్య, శ్రీకాకుళం జిల్లా

వర్షాకాలంలోనూ, చలి ఎక్కువగా వున్నప్పుడు కొంతమందికి తరచూ జలుబు చేస్తూ వుంటుంది. అది జబ్బేమీ కాదు. దానికి ప్రత్యేకమైన మందులు అవసరం లేదు. గొంతులోంచి అప్పుడప్పుడు బియ్యం గింజలాంటిది పడుతోందని మీరు భావిస్తున్నది ఊపిరితిత్తుల నుండి వస్తుంది. మనం పీల్చే గాలితో పాటు దుమ్మూ, ధూళి ఊపిరితిత్తులలోకి పోతాయి. వాటిని ఊపిరితిత్తులు మళ్ళీ బయటకు నెట్టివేస్తాయి. అదే మీరు బియ్యం గింజలాగా పడుతుందని రాసింది. ఇది మన శరీరానికున్న సహజ సిద్ధమైన రక్షణ. దానిని గురించి మీరు కలత చెందనవసరం లేదు.

డాక్టరు పి.అజయ్‌కుమార్,

డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు.


సెక్రటేరియట్‌ని మించిపోవాలని.. మన కార్యదర్శి.. ఇలా.. ఏర్పాటు చేసాడుట
బయోటెక్
వరల్డ్ బ్యాంక్ కన్సల్టెన్సీ
గ్రామ సచివాలయం
త్వరలో గ్రామ సచివాలయాలు


విద్రోహుల చర్యలు దారుణం అన్యాయం అక్రమం
ఫోటో ప్లీజ్
ఉగ్రవాద చర్యలు
GANGA DHAR


విశ్వశాంతి స్థాపనే మా ధ్యేయం
ఇరాక్
అఫ్ఘన్
GANGA DHAR

అమర సైనికుల్లారా... క్షమించండి!

అమరత్వం పొందిన వీర సైనికుల్లారా
క్షమించండి మమ్మల్ని!

ఆశబోతుల అవినీతిని, అమానవీయతని
ఎలా అభివర్ణించాలో అర్థం కావటం లేదు
దిగ్భ్రాంతికరమైన ఈ కుత్సిత కూటమిని
ఏమని ప్రస్తావించాలో పాలుపోవటం లేదు!

ఇప్పటికున్న ఉపమానాలూ ఉదాహరణలూ సరిపోలవు
పోలికలూ పొంతనలూ అన్నీ పాతవే
ఇక ఆ అవినీతి మూర్తుల అసలు నామాలే
ఈ దుర్భరిత దుశ్చర్యకు సిసలు చిరునామా!

మీ త్యాగాల రుధిరపు ధారల్లో
ఈ నేల రుద్రమై గర్జించిన వేళ
జిత్తులమారులు ఇన్ని ఎత్తులు వేస్తారనుకోలేదు
వందేమాతరమని నినదించిన దారుల్లో
జాతి యావత్తూ ప్రభంజనమై కదిలిన క్షణాన
ఇక్కడ వందలు, డాలర్ల గురించి తపిస్తారనుకోలేదు
కోట్లాది జనం ఒక్కటై నడిచిన సమయంలో
వాళ్లు 'కోట్లు' గురించి కలలు కంటున్నారని
ఊహించలేకపోయాం

అమరత్వం పొందిన వీర సైనికుల్లారా
క్షమించండి మమ్మల్ని!!

ప్రాణాలను కూడా మారకద్రవ్యం చేయగల
మహా మాయావులున్నారని ముందుగానే
పసిగట్టలేకపోయాం
మీ అమరత్వాన్ని, దేశభక్తిని వాళ్ళు అధికారంగా మార్చుకున్న
రాజకీయ కుత్సితాన్ని గమనించగలిగాం కానీ,
అంతకుముందే దాన్ని డాలర్లు చేసుకున్న నీచాన్ని
కలనైనా ఊహించలేకపోయాం..

అమరత్వం పొందిన వీర సైనికుల్లారా
క్షమించండి మమ్మల్ని!

ఇంత జరిగినా,
కనీసం సిగ్గునైనా ప్రదర్శించనీ
నిలువెత్తు 'చిరునవ్వుల్ని' చూస్తున్నాం
పశ్చాత్తాప ఛాయల్ని కూడా ప్రకటించని
పరమ నైచ్యాన్ని దర్శిస్తున్నాం

అమరత్వం పొందిన వీర సైనికుల్లారా
క్షమించండి మమ్మల్ని!!

-సత్యాజీ

తస్మాత్...!

నా పాకను పాకిన ఎండకూ
ఆ నీరెండకు సాగిన నా నీడకూ
అంటరానితనం అంటగట్టిన వాడే
సహపంక్తి భోజనమనే సరికి
నీరుకొండ నివ్వెరబోయింది

మా ఆడాళ్ళ అంగాంగంపై
వీరంగం చేసిన కసాయి
నేటి కొంగ జపాలకు
పందిరికుప్పం పగలబడి నవ్వింది

★ ★ ★

మీరు వెంటాడి వేటాడగ
మా కళేబరాల్లో దిగిన
ఈటెలు, బరిసెలు, వేటకత్తులకు
తులసీ తీర్థ స్నానాలంటే
కారంచేడు ఎలుగెత్తి ఘోరం అంది

మీరు తగలబెట్టిన మా ఇళ్ళముందే
ఏడ్చి ఏడ్చి నీళ్ళింకిన మా కళ్ళముందే
దయ్యాల వేదాల పలుకులకు
చుండూరు గుండెలు బాదుకుంది

మహామేధావిని మహోన్నతుడిని
ఢిల్లీ అగ్రవర్ణం దళితుడంటూ
అధమ పౌరుడిగా చిత్రించినప్పుడు
యావత్ భారతం బావురుమంది

★ ★ ★

మీరు మా సంకటి జోలికి రాకుంటే..
మా వేరు గలాసుల నీళ్ళకూ
మీ మొసలి కన్నీళ్ళకూ
మీ ధన భుజ బలాలముందు
మేమోడి పోయి సాగిలపడ్డప్పుడు
మీ చంకల కింద చేతూపుళ్ళకు
మీ నరంలేని నోళ్ళకూ
ఊరవతలగా విసిరేసిన
మా కొంపలు చెబుతాయి 'కోటి దండాలు'
మమ్మల్ని అంటకుంటేనే మేలు
మీ నీడల జాడలే పుట్టిస్తాయి
మా గూడేల్లో 'శతకోటి గండాలు'

★ ★ ★

నెత్తురు తాగే గూండాలు
గండదీపాలెత్తుకున్నారు
తస్మాత్....

-శ్రీరాంరావు.కె

చెప్పేదొకటి... చేసేదొకటా!

శాంతి

అడిగి తెలుసుకో.. చూసి నేర్చుకోవాలి.. చెప్పింది వినాలి... ఇలా అనేకం మనకు నిత్యం ఏ ఇంట్లో అయినా వినిపించేవి. ఈ నీతి సూక్తులన్నీ ఎవరికా అనుకుంటున్నారా? ఇంకెవరికండీ పొద్దున్న లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ పిల్లల్ని అదిలిస్తూ బెదిరిస్తూ అరిగిపోయిన టేప్‌రికార్డులా చెపుతూనే వుంటారు తల్లిదండ్రులు. టీవీలో ఏదైనా సినిమా వస్తుంటే అందరూ కలిసి చూస్తూ వుంటారు. ఇంతలో పిల్లవాడికి సందేహం వచ్చి అడిగినా.. ఆ సందేహం తీర్చకుండా.. "ముందు టీవీ చూడు తర్వాత నీకే తెలుస్తుంది.. అట్టే విసిగించకు.. నాకు కోపం వచ్చిందంటేనా.. రెండు పీకానంటే అన్నీ అర్థమవుతాయి... నన్ను చూడనిస్తావా?.." ఇలా చెప్పుకుంటూ పోతే అబ్బో అనేకం అంటుంటాం మనం.

పిల్లలేకదా అన్న తేలికభావంతో ఒకోసారి వాళ్లు వేసే క్లిష్ట ప్రశ్నలకు సమాధానం తెలియదని చెప్పకుండా... "వెధవ ప్రశ్నలన్నీ వేసి విసిగించక... ఎక్కడలేని వెధవ ఆలోచనలన్నీ నీకే... వెళ్లి ఆడుకో..." ఇలా చాలా అనడం మనం సర్వసాధారణంగా వింటుంటాం. "చూసి నేర్చుకో", "చెప్పింది వినాలి" అనేవి పిల్లలకి తరచూ తల్లిదండ్రులు చెప్పే మాటలు. అయితే ఆ పసిపిల్లలు ఇంట్లో పెద్దలనీ అంటే మనల్ని చూసి నేర్చుకుంటారు సుమా.. ఇది మాత్రం అందరం మర్చిపోతాం..

"అబద్ధాలు ఆడకూడదు.. ఎటువంటి పరిస్థితుల్లోనూ నిజమే చెప్పాలి" అని చెప్తాం. సరిగ్గా అదే సమయంలో పనిమనిషి వచ్చి "అమ్మా ఒక పాత చీరుంటే ఇయ్యమ్మా.. బొత్తిగా చీరలు లేక ఇబ్బంది పడిపోతున్నానుగందా.." అని అనగానే "ఇప్పుడు నా దగ్గరేం లేవు.. వున్నప్పుడు నేను ఇస్తాగా నువ్వు అడగాలా, ఏంటీ?" అంటాం. మధ్యాహ్నం పాతబట్టలకు స్టీలు సామాన్లిచ్చేవాళ్లు వస్తే పిలిచి... ఇంట్లో వున్న పాతబట్టలమూట వాళ్లముందేస్తాం... ఇచ్చినవి సరిపోక ఇంకో చీరుంటే ఇయ్యండి.. ఈ పెద్ద స్టీలు డబ్బా ఇస్తానంటే వెళ్లి ఇంకో చీర తెచ్చి ఇస్తాం. ఇదంతా గమనిస్తున్న పిల్లలు "అమ్మా, ఇందాక పని అమ్మాయి పాతచీరడిగితే లేవన్నావుగా?! మరి ఇవన్నీ ఉన్నాయిగా" అంటే నోర్మూయ్ అని కసురుకుంటాం. అబద్ధం చెప్పకూడదని అబద్ధం ఆడుతున్నావు అని పిల్లలు ముఖంమీద అంటారు. మరి ఇలాంటివి పెద్దలు చేస్తుంటే చూసి పిల్లలు ఎంత నేర్చుకుంటారు? "ఇవాళ మీ ఇంట్లో ఏం వండారు?" అని పక్కింటావిడ అడిగితే టమాటా పప్పు, సాంబారు, కొబ్బరిచట్నీ, దొండకాయ వేపుడు చేశాను. నాలుగురకాలు లేకుంటే మావారు తింటారుగానీ, నాకు మాత్రం ముద్ద నోట్లోకి పోదండీ అంటూ హెచ్చులు పోతారు కొందరు ఆడవాళ్లు. పక్కనున్న వాళ్లమ్మాయి అమాయకంగా తల్లిముఖంలోకి చూస్తూ "అమ్మా, మరి నువ్వు అన్ని వండితే నాకు కొబ్బరిచట్నీ ఒక్కటే వేసి పెట్టావేం?" అని అడుగుతుంది. అప్పుడు ఆవిడ ముఖం, పక్కింటావిడి వంకర నవ్వు చూసి తీరాల్సిందే. ఇంట్లోకి వచ్చాక ఆవిడ పిల్లని "పరువు తీశావుగదే.. దరిద్రపుముండా" అంటూ చావబాదుతుంది. పరువు తీసింది ఆపాపకాదు. అబద్ధాలు ఆడింది ఆవిడ. "నిజాయితీగా వుండాలి. అబద్ధాలు చెప్పకూడదు" అంటూ పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకుని "నాన్నా-పులి" కథ చెబుతుంది తల్లి. పులి రాకపోయినా వచ్చిందంటూ ఆపిల్లవాడు తండ్రిని తమాషాగా రెండుసార్లు పిలవటం.. తండ్రి కోప్పడటం..నిజంగా పులి వచ్చినప్పుడు పిలిచినా తండ్రి రాకపోతే ఆపిల్లవాడు ఎలా బలైపోయిందీ.. అబద్ధాలు ఎలా ప్రాణం తీస్తాయో.. వివరిస్తున్న సమయంలో పక్కింటావిడ "వదినగారూ, కాస్త కందిపప్పు వుంటే ఓ డబ్బాడు ఇస్తారా? మళ్లీ మేం రేపు సరుకులు తేంగానే ఇచ్చేస్తాను" అంటుంది. ఆమాటకు అబద్ధాలు ఆడకూడదని చెపుతున్నావిడ "అయ్యో, మా ఇంట్లో ఈరోజే అయిపోయిందండీ.." అంటుంది. "అదేంటమ్మా, రాత్రే నాన్నగారూ, నేనూ సరుకులన్నీ తెచ్చాంగా..." అంటుంది. పిల్లని చూపుల్తోనే నమిలి మింగేసినంత పనిచేస్తుంది తల్లి. పక్కింటావిడ అటు వెళ్లగానే ఆ పిల్లని బెల్టుపెట్టి నాలుగు వాయిస్తుంది. "చిన్నదానివి నీకెందుకు ఆవిషయాలు....నాన్న తెచ్చే కందిపప్పు చాలా మంచిది. వాళ్లు నాసిరకం తెచ్చుకుంటారు.. అందుకే లేదన్నాను" అంటుంది. అయితే మరి నువ్వు అబద్ధం ఆడినట్లేగా అని ఏడుస్తున్న పిల్ల అనగానే మళ్లీ... రెండు వుతుకుతుంది ఆ ఇల్లాలు. తనో పక్క అబద్ధాలు ఆడుతూ.. ఆడకూడదని నీతి చెపితే.. ఆ తల్లి అంటే వాడికి విలువ వుంటుందా? ఇంకొందరు తండ్రులు హడావుడిగా ఇంట్లోకి వస్తూనే "ఒరేయ్ నానీ నాకోసం ఎవరైనా వస్తే మానాన్న ఊళ్లో లేరు. క్యాంపుకు వెళ్లారు. ఎప్పుడు వస్తారో తెలియదు" అని చెప్పు అంటూ గదిలోకిపోయి తలుపులు బిగించుకుంటారు." "ఉన్నానని చెప్పావో తాటతీస్తా" అని కూడా అంటాడు. ఇంట్లో ఇలావుంటే.. స్కూల్లో అన్నా ఒకంత బాగుంటుందేమో అంటే అక్కడ ఒరిగేదేమీ వుండదు. క్లాస్‌రూంలో "సత్యమునే పలకవలెను" అని గోడలకు, చార్టుల్లో వుంటాయి. డిఇఓ ఇన్‌స్పెక్షన్‌కు వస్తారు. "ఒరేయ్ పిల్లలూ.. డిఇఓగారు సిలబస్ అంతా అయిందా? అనడిగితే అయిపోయిందని చెప్పండి.. అవలేదని చెప్పారో, తెలుసుగా నా సంగతి? పరీక్షల్లో సున్నాపెడతా" అని బెదిరిస్తారు టీచర్లు. "నేను ఇంటిదగ్గర ప్రయివేట్లు చెపుతున్నానని చెప్పారంటే గోడకుర్చీ వేయిస్తా ఒక్కొక్కళ్లనీ" అని బెత్తంకూడా చూపించి కళ్లెర్ర చేస్తారు. అంటే అబద్ధం చెప్పమని టీచర్లే స్వయంగా బెదిరించిమరీ బోధిస్తున్నారన్నమాట. కాని గోడలమీద, చార్టుల మీద వేరే వుంటుంది నీతి. దీన్ని బట్టి పిల్లలకి క్రమంగా అవగాహన వస్తుంది. ఇతరులకు నీతి చెప్పాలి కానీ.. ఆచరించనవసరం లేదని, ఆచరణలో అబద్ధాలు ఆడవచ్చు....

ఇదంతా చూస్తుంటే ఏమి తెలుస్తుంది? పిల్లల్ని మనమే చేతులారా చెడగొడుతున్నాం... వాళ్లంతట వాళ్లు చెడిపోవడం లేదు. పిల్లలు పెద్దయి మనమాట వినకుండా చెడుతిరుగుళ్లు తిరుగుతుంటే మనం పిల్లలు చెడిపోయారని బాధపడతాం. కాని వాళ్లను చేజేతులా మనమే చెడగొట్టాం అని అనుకోం...

పిల్లలు చిన్నప్పట్నుంచే అంటే మూడోనెల నుంచి చూసి నేర్చుకోవడం, పరిశీలించడం అలవరచుకుంటారు. కాబట్టి వాళ్ల ముందు మనం ఎంత నిజాయితీగా ఉంటే అంత మంచిగా పిల్లలు తయారై ఎదుగుతారు. తండ్రి సిగరెట్టు ఊదుతూ పిల్లల్ని కాల్చవద్దంటే ఏం సబబు? పొద్దున్నే మనం లేవకుండా పిల్లల్ని లేచి చదవమనటం ఎంతవరకు సమంజసం? కాబట్టి తమ పిల్లలు ఉన్నతంగా ఉండాలి అనుకునే తల్లిదండ్రులు ముందు తాము అలా ఉండటానికి ప్రయత్నించాలి. కొన్ని విషయాల్లోనైనా జాగ్రత్తగా కనీసం పిల్లలముందైనా మసలుకోవాలి. వాళ్లముందు తరచూ తగాదాలు పడడం, గొప్పలు చెప్పడం వంటివి మానుకోవాలి. పిల్లల మనస్సులు పాలవంటివి. అందులో ఉప్పుకలిసినా, చక్కెర కలిసినా మనవంతు ఎక్కువగా వుంటుందన్న విషయం మనం మర్చిపోకూడదు. ★

కనువిప్పు

అప్పుడే తెల్లవారింది. పెరట్లో వేపచెట్టుకింద మంచంలో నిద్రపోతున్న శ్రీను మూలుగుతూ కళ్ళు తెరిచాడు. కడుపులో నొప్పి మొదలయ్యింది. మెల్లగా లేచి కూర్చున్నాడు. తల్లి పార్వతమ్మ వాకిలి ఊడ్చుతోంది.

'అమ్మా కడుపులో నొప్పిగా ఉందే' అన్నాడు శ్రీను కుడిచేత్తో పొట్టను పట్టుకుంటూ.

'పొద్దున్నే కడుపునొప్పి ఏమిట్రా! అదే తగ్గుతుందిలే గానీ లేచి ముఖం కడుక్కో' అంది పార్వతమ్మ. శ్రీను బలవంతంగా లేచి ముఖం కడుక్కొని మంచం మీద కూర్చున్నాడు. కడుపునొప్పి తగ్గకపోగా మరింత పెరిగింది.

కడుపునొప్పి ఎక్కువ అవుతోందని పదేపదే తల్లికి చెప్పసాగాడు శ్రీను. 'దిష్టి తగిలినట్లుంది. లోపలకు పద. దిష్టి తీస్తాను' అంటూ శ్రీనును వంటింట్లోకి తీసుకువెళ్ళి దిష్టి తీసింది. మధ్యాహ్నం పన్నెండు అయ్యింది. నొప్పిమాత్రం తగ్గలేదు. శ్రీను బాధగా మూలుగుతూనే ఉన్నాడు. పొలం వెళ్లిన తండ్రి వీరయ్య తిరిగివచ్చి విషయం తెలుసుకున్నాడు.

'ఇదేదో మామూలు దిష్టి కాదు. పెద్ద దిష్టే తగిలింది. మంత్రాల పాపయ్యను తీసుకువచ్చి మంత్రం వేయించాలి' అంటూ పాపయ్య ఇంటికి బయలుదేరాడు వీరయ్య.

అరగంట తరువాత పాపయ్యను వెంటబెట్టుకొని వచ్చాడు వీరయ్య. పాపయ్య శ్రీను పక్కన కూర్చొని కొద్దిసేపు తనలో తాను ఏవో మంత్రాలు చదివాడు.

'మరేం ఫరవాలేదు. గంటసేపట్లో కడుపునొప్పి తగ్గిపోతుంది' అని చెప్పి వీరయ్య ఇచ్చిన పది రూపాయలు తీసుకొని పోయాడు. రెండు గంటలు గడిచినా శ్రీను కడుపునొప్పి తగ్గలేదు. రెండు చేతులతో కడుపు నొక్కుకుంటూ నొప్పి భరించలేక మంచంలో అటూ ఇటూ పొర్లసాగాడు. వీరయ్య, పార్వతమ్మలకు ఆందోళన మొదలైంది.

అప్పుడు వీరయ్య భార్యతో 'పిల్లాడికి ఏదో గాలి సోకినట్టుంది. గ్రామ దేవతైన కట్టమైసమ్మకు మొక్కుదాం. పిల్లాడికి బాగైతే కోడిపిల్లను కోద్దాం' అంటూ ఇద్దరూ వెళ్లి కట్టమైసమ్మకు మొక్కి వచ్చారు. సాయంత్రమైనా శ్రీను నొప్పి తగ్గలేదు. ఇరుగు పొరుగు వారు వచ్చి చేరారు. శ్రీను చేత ఆ పసరు, ఈ పసరూ తాగించినా లాభం లేకపోయింది.

'ఇన్ని చేసినా నొప్పి తగ్గట్లేదు. ఏం మాయదారి రోగమో ఇది. ఎందుకైనా మంచిది. ఓసారి పట్నం తీసుకుపోయి ఆస్పత్రిలో చూపించండి' అన్నారెవరో.

వెంటనే ఎడ్లబండిలో శ్రీనును తీసుకుని పట్నం బయలుదేరారు వీరయ్య, పార్వతమ్మ, మరికొందరు గ్రామస్థులు. చీకటిపడే వేళకు ఆసుపత్రికి చేరుకున్నారు. డాక్టర్ పరీక్షించి ఆపరేషన్ చేయాలన్నాడు. వెంటనే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసి పూర్తి చేశాడు. శ్రీను కడుపునొప్పి తగ్గి నిద్రపోయాడు.

అప్పుడు డాక్టర్ 'శరీరానికి ఏ అనారోగ్యం కలిగినా వెంటనే డాక్టర్ దగ్గరకు రావాలి. మీకు తెలిసింది ఏదో చేసి ఇలా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. శ్రీనుకు వచ్చింది మామూలు కడుపునొప్పి కాదు. దీన్ని అపెండిసైటిస్ అంటారు. ఇరవై నాలుగు గంటల్లో ఆపరేషన్ చేయకపోతే చనిపోతారు. మీ మూఢ నమ్మకాలతో ఏదో పసరు తాగించి అలాగే ఉంటే శ్రీను దక్కేవాడు కాదు. ఇకనైనా సొంత వైద్యం మానుకోండి' అన్నాడు.

డాక్టర్ మాటలు విని అందరూ బాధపడ్డారు. తమ అజ్ఞానానికి కారణం చదువు రాకపోవడమేనని అనుకున్నారు. రేపటి నుండే గ్రామస్థులంతా చదువుకోవాలని నిర్ణయించుకున్నారు.

-పెండెం జగదీశ్వర్



శాంతిసామరస్యాలకు ప్రతీక 'క్రిస్మస్'

ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకునే పెద్ద పండుగ క్రిస్మస్. ఇది ప్రతి ఏటా డిసెంబర్ 25న వస్తుంది. ఆ రోజు ఏసుప్రభువు పుట్టిన రోజు. పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా అత్యంత ఉత్సాహంగా జరుపుకునే పండుగల్లో ఇదొకటి. ఈ పండుగ వస్తోందంటేనే పిల్లలు, యువతీయువకుల హడావుడి అంతాఇంతా కాదు. పండుగకు సుమారు పదిపదిహేను రోజుల ముందునుంచే గ్రీటింగ్స్, క్రిస్మస్ కేకులు, స్టార్స్ తదితరాలతో దుకాణాలు కొత్త అందాలను సంతరించుకొంటాయి. ఇక పిల్లల హడావుడి సరేసరి. స్నేహితులకు, బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ గ్రీటింగ్స్ పంపడంలో నిమగ్నమై వుంటారు.

"కన్య మరియకు ఓనాటి రాత్రి గాబ్రియేలు దూత ప్రత్యక్షమై "మరియా! దేవుని కృప వలన నీవు గర్భం ధరించెదవు. నీవు క్రీస్తుకు జన్మనిచ్చెదవు" అని చెపుతుంది. అప్పటికి మరియకు యోసోపుతో ప్రదానం మాత్రమే జరుగుతుంది. గర్భం దాల్చిన మరియను విడిచిపెట్టే ఆలోచన చేస్తున్న యోసోపుకు కలలో దూత ప్రత్యక్షమై "మరియ దేవుని వర ప్రసాదముచే గర్భం ధరించింది. తనకు లోకరక్షకుడైన ఏసు జన్మిస్తాడు. ఆమెకు తోడుగా వుండుము" అని చెప్తుంది. ఆ కాలంలో జనాభా లెక్కలు సేకరించేటప్పుడు ఎక్కడ ఉన్నవారైనా తమ స్వస్థలాలకు వెళ్ళాల్సి వుండేది. నెలలు నిండిన మరియను తోడుకొని బెత్లెహేముకు వెళతాడు యేసోపు. "డిసెంబర్ 24 అర్ధరాత్రి పశువుల కొట్టంలో ఏసు జన్మిస్తాడు. అదే సమయంలో ఆకాశంలో ఒక నక్షత్రం కనిపిస్తుంది." అని బైబిల్ చెబుతుంది.

క్రైస్తవులే కాకుండా అన్ని వర్గాల ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొంటూ స్నేహసౌభ్రాతృత్వాలను పంచుకొనే రోజు డిసెంబర్ 25. పండుగ ముందు రోజు రంగురంగుల విద్యుద్దీపాలతో, బొమ్మలతో క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేస్తారు. కొత్తబట్టలు ధరించి తెల్లవారుజామునే చర్చికి వెళతారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. 24వ తేదీ అర్ధరాత్రి క్రిస్మస్‌తాత (శాంతాక్లాజ్) ఇళ్ళలోకి వచ్చి బహుమతులు ఇచ్చే సాంప్రదాయం పాశ్చాత్య దేశాల్లో అధికంగా ఉంది. ఈ సాంప్రదాయం మనదేశంలో ఇటీవల కాలంలో బాగా పెరిగింది. అంతేకాకుండా ఇళ్ళలోనే రంగురంగులతో అలంకరించిన కేకులను కట్‌చేయడం, టపాసులు కాల్చడం వంటి పనులన్నింటిలోనూ పిల్లలే ముందుంటారు. క్రిస్మస్ మరుసటి రోజు అంటే 26వ తేదీ ధనిక కుటుంబాల వారు పేదలకు దాన,ధర్మాలు చేస్తారు. ఈ వేడుకను బాక్సింగ్ డే అంటారు. శాంతి, సామరస్యాలకు ప్రతీకగా కిస్మస్‌ను జరుపుకొంటారు.

- సాహితి కంచర్ల

చిన్నారి చిత్రకారులు



సిహెచ్. వినయ్‌తేజ, 7వ తరగతి
శ్రీచైతన్య విద్యానికేతన్, చినకాకాని



రేష్మా అఫ్రీన్,
3వ తరగతి

ఎం.డి. ఇర్ఫాన్ మొయినొద్దీన్,
2వతరగతి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా



జి.దుర్గాదేవి, 10వతరగతి
లూథరన్ హైస్కూల్, పెద్దాపురం

కలంస్నేహం



పేరు: నకిరెకంటి ప్రవీణ్
వయస్సు: 12
చదువు: 7వ తరగతి
హాబీలు: క్యారమ్స్, క్రికెట్ ఆడటం
పూర్తి చిరునామా: సన్నాఫ్ నకిరెకంటి ఎల్లయ్య, గ్రామం : వెల్లంకి, మండలం : రామన్నపేట, జిల్లా : నల్లగొండ

పేరు: గంధం రవికుమార్
వయస్సు: 14
చదువు: 8వ తరగతి

హాబీలు: చెస్, క్యారమ్స్ ఆడటం, ఆర్ట్ వేయడం, పుస్తకాలు చదవడం,
పూర్తి చిరునామా: కేరాఫ్ నాగార్జున రెసిడెన్షియల్ హైస్కూల్, బండారునగర్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా

పేరు: మాండ్ర శివకుమార్
వయస్సు: 14
చదువు: 10వ తరగతి
హాబీలు: చెస్, క్యారమ్స్ ఆడటం, బొమ్మలు గీయడం
పూర్తి చిరునామా: చిన్న మసీదు దగ్గర, గ్రా, మం : రామన్నపేట, నల్గొండ జిల్లా

వరి	వరి	ర్చి	ప్రిల్	మే	న్	2002					లై	గష్టు	బర్	బర్	బర్	బర్
ఆది	బుధ	బుధ	శని	సోమ	గురు	★	6	13	20	27	శని	మంగ	శుక్ర	ఆది	బుధ	శుక్ర
సోమ	గురు	గురు	ఆది	మంగ	శుక్ర	★	7	14	21	28	ఆది	బుధ	శని	సోమ	గురు	శని
మంగ	శుక్ర	శుక్ర	సోమ	బుధ	శని	1	8	15	22	29	సోమ	గురు	ఆది	మంగ	శుక్ర	ఆది
బుధ	శని	శని	మంగ	గురు	ఆది	2	9	16	23	30	మంగ	శుక్ర	సోమ	బుధ	శని	సోమ
గురు	ఆది	ఆది	బుధ	శుక్ర	సోమ	3	10	17	24	31	బుధ	శని	మంగ	గురు	ఆది	మంగ
శుక్ర	సోమ	సోమ	గురు	శని	మంగ	4	11	18	25	★	గురు	ఆది	బుధ	శుక్ర	సోమ	బుధ
శని	మంగ	మంగ	శుక్ర	ఆది	బుధ	5	12	19	26	★	శుక్ర	సోమ	గురు	శని	మంగ	గురు

కూర్పు : మార్క ప్రవీణ్ గౌడ్, గ్రామం : రెడ్లరేపాక, జిల్లా : నల్లగొండ

మాటలకోట - 37

1		2		●	3	●	4	●	5
	●		●	6	●	7		8	●
●	9		10	●	11		●	12	
13		●	14			●	15		●
	●	16		●	17	18		●	19
●	20		●	21	●		●	22	
23	●	24	25	●	26		27		●
28	29	●	30	31		●		●	32
●	33		●		●	34		35	
36		●	37				●		●

అడ్డం

1. సరస్సు (4)
3. 'లం' చేరిస్తే చేపలు పట్టేది (1)
5. 'ను'తో కోట (1)
6. 'డి' జత చేస్తే ఆలయం (1)
7. మరచిపోవడం (3)
9. అలసట (3)
11. ఒక గ్రహం (2)
12. రహస్యం (2)
13. మేడ (2)
14. రుచి చూసేది ఇదే (3)
15. పొదవు, సమూహం (2)
16. వాదించేవాడు (2)
17. జ్వరం వస్తే ఏమి తినలేని అవస్థనే ఇదంటారు (3)
20. అటునుండి యజ్ఞం (2)
21. 'ల' చేరిస్తే గుత్తి (1)
22. తొలి, మొదలు (2)
24. అంగడి (2)
26. ఇది తన నలుపు ఎరగదట (4)
28. మన్మధుని భార్య (2)
30. ఉప్పు (3)
33. 'తస్లీమా' వివాదాస్పద నవల (2)
34. ముగ్గురు కాదు, ఐదుగురు కాదు. మధ్యలో ఉన్నారు (4)
36. శరీరంలో ఒక భాగం (2)
37. మందహాసం (4)

నిలువు

1. శబ్దం (2)
2. లాయరు (3)
4. ఒక వాహనం (2)
7. డబ్బు (2)
8. తడబడ్డ పురుగు (3)
9. బాదుగ (2)
10. ఇల్లు బాగుండాలంటే ఇది పటిష్టంగా ఉండాలి (3)
11. ముక్క ఖండం (3)
13. అమితం కానిది (2)
15. శరం (2)
16. కాకి (3)
18. కొప్పు, శబరిలా ధ్వనిస్తుంది (3)
19. వందలో పదో వంతు (2)
22. మధ్యమం కోల్పోయిన ఆపద (2)
23. నక్షత్రం (2)
25. శిరస్సు (2)
26. అడ్డం 12 తొలిసగం, నిలువు 15 మలిసగం కలపండి (2)
27. బహువచనంలో విందు (3)
29. నువ్వులు (3)
31. సొత్తు (3)
32. పద్ధతి, నైజం (2)
34. ఇది నాలుగు విధాల చేటు అని ఓ నానుడి (2)
35. సంజ్ఞ (2)

గతవారం జవాబులు : అడ్డం : 1. బురద 3. జె 4. లే 5. వంద 6. హరి 8. అలం 9. మనం 10. సావధానం 11. టీ 12. ఆహా 13. ఆగదు 14. దంతం 16. ప్రతీకారం 18. తుట్టె 19. సంస్థా 20. చిరాయువు 22. నంది 24. పత్రం 27. శకటం 29. గోళం 30. లుప్తం 31. నుదు 32. ఆదా 33. కలిమి 34. రుజువు **నిలువు** : 1.బుగ్గ 2. దహనం 5. వేలం 7. లవదు 8. ఆనందం 9. మహాప్రస్థానం 10. సాగరం 13. ఆకారం 15. తంతువు 17. సిరా 20. చిత్రం 21. యుగళం 23. దిశ 24. పటం 25. వాయిదా 26. జలుబు 28. కదలి 29. గోదురు 32. ఆవు

"తెహల్కారాజుగారి పిల్లి! కార్గిల్ 'కాగ్' పద్దులో నల్లి"

రుక్మిణి

రణరంగమున పోరు భీకరముగా జరుగుచుండెను. తన ప్రత్యేక గుడారములో మహారాజు శ్రీశ్రీశ్రీ వాజమ్మయ్యగారు పట్టు బాలీసుల నానుకుని కళ్ళు మిటకరిస్తూ.... మధ్య... మధ్య.. మోకాటి చిప్పలను సవరదీసుకుంటూ మృదు మధుర కవితాలాపన చేయుచుండిరి. ఎన్నో దినములు అతి నికృష్టముగా గడిచినవి. రాజధాని నగరము నుండి ప్రత్యేక వార్తా రహులు వార్తలను చేరవేయకుండిరి - మనసంతా భీకర యుద్ధము పైననూ.. అటు అంతఃపురము, దాని తాలూకు సింహాసనము పైననూ కళవల పడుచున్నది!

అపుడే వార్తారహుడు అరుదెంచి వందనములు సమర్పించెను. పూర్వకాలములో ఈ వార్తరహుడు సందర్భ సహితములు... ఉచితానుచితములతో బాటు పిడుగు వార్తలను కూడా పిల్ల తెమ్మెరల్లా వీనుల విందుగా వివరించుటలో ప్రత్యేక తర్ఫీదు పొందిన దిట్టగా నేర్పరిగా గమనింపవలె! సంభాషణము ఇట్లు జరిగినది -

రాజు : - ఏమిరా జారు పేర్నయా... అంతా కుశలమేగదా? (మిక్కిలి ఆత్రముగా)

పే : - ఆఁఆఁ... కుశలమని తమరు తలంచవలె... హమ్మయ్య ఎలాగూ ప్రస్తుతానికి తమరు కుశలమేగదా... కుశలమా అంటే... కుశ...ల...మే.. (రెండు గుంటకలు మ్రింగినాడు)

రా :- ఏమిరా.. మారాణిగారు... అంతఃపురం... సింహాసనం అంతా కుశలమే గదా? (మిక్కిలి ఆందోళనగా)

పే : ఆఁఆఁ.. కుశలమా అంటే... కుశలమే... మరయితే... తమ పెంపుడు మార్జాలం గారు అదే మన పిల్లిగారు.. పి...ల్లిగారు.. (కుళ్ళి కుళ్ళి ఏడుపునభినయించాడు)

రా :- ఏమిరా! అయ్యో... గాలివాటం పిల్లి... చేతివాటం పిల్లి... నా పంచప్రాణాలు... (అమితంగా కుమిలిపోయినాడు) ఆ పిల్లిపీడా పాయిరి... మరి.. మారాణిగారు... అంతఃపురం... సింహాసనం...

పే : - ఆఁఆఁ కుశలమా అంటే... వెన్నముద్ద కోసం పిల్లిగారు అంగలెసుకుంటూ పోబోగా మన శునకంగారు భౌభౌమని గాండ్రించగా...

రా:- (కుపితుడై) మూర్ఖుడా... శునకాలు గాండ్రించవని రాజ్యాంగంలో వుంది - ఆఁఆఁ కానీ...

పే : - పిల్లిగారు గెంతిన గెంతుకు దీపపు సెమ్మె కూలి శునకంగారి శరీరం అంటుకుంది. శునకం గారు భౌభౌమని మంటలతో గుర్రపుశాలలోనికి గెంతగా...

రా :- హత్తెరి... శునకంగారు హరీమన్నారా... హతవిధీ... కానీ... కానీ మారాణీగారు... అంతఃపురం

పే :- శాల అంటుకుంది... ఏం పర్వాలేదులెండి... వెన్నముద్ద క్షేమం...

రా : - ఓరినీ... అశ్వశాల మొత్తం దగ్ధమైపోయిందా? మూర్ఖుడా... మరి మా రాణీగారు... అంతఃపురం...

పే :- అబ్బెబ్బే... మనవి చేసుకుంటాను... గుర్రములు పూర్తిగా వాటి కర్మకు అవి కాలుతూనే దాడులు తీస్తూ గజశాలలోనికి ప్రవేశించినాయి ప్రభువా... (గుడ్ల నీరు గ్రక్కుతూ)

రా :- హా... హ.... నా పట్టపుటేనుగు... మా రాణీగారు... అంతఃపురం... సింహాసనం... (వగర్చాడు)

పె :- అబ్బెబ్బే... ఆ పెనుమంటలు అట్లా సైనిక శాలల నుండి వ్యాపించుతూ అల్లనల్లన అంతఃపురపు తెరల దాకా పాకి వాటి పని పట్టినవి. ఎంతో శోభాయమానంగా అంతఃపురమూ.. రాజ ప్రాసాదములు అంటుకుని వెలిగిపోతున్నవి ప్రభువా... (చప్పరిస్తూ చొంగలు కార్చినాడు)

రా : - ఓరి దరిద్రుడా! అంతఃపురము చంకనాకి పోయినది కదా! మరి మా రాణీగారు... కుశలమేగదా... నా సింహాసనం... పిల్లలు... అయ్యో... (ఆవేశమున కంపించిపోతూ మొకాలి చిప్పలు చరుచుకున్నాడు)అయ్యో...

పే : - అయ్యోలేదు... కుయ్యో లేదు ప్రభువా... మొత్తానికి మొత్తం.. మీ సమస్త బంధుజనం ఆ అగ్ని కీలల్లో కాలి... మలమలమాడి..

రా :- హా... హాఁ.... (అధాటున మూర్ఛపోవును... వార్తారహుడు పలాయనము చిత్తగించెను)

★★★

"మీరు తిరిగి రక్షణమంత్రి పదవిలో కూర్చోడం నాకు చాలా ఆనందంగా వుంది. మన సమతాపార్టీ ప్రతిష్ట ఈ దెబ్బతో పదింతలు పెరిగిపోయింది! మీరు నిష్కళంకులనీ... మచ్చలేని స్వచ్ఛమైన రాజకీయాలలో ఆరితేరిన వారనీ లోకానికి తెలిసిపోయింది!" జయాజెట్లీగారు కలువపూల గుచ్ఛాన్ని ఫెర్నాండెజ్ గారి కందిస్తూ గునిసింది మరే... మరే...!" కుర్చీలో అసహనంగా అటు ఇటు కదులుతూ అన్నాడు ఫెర్నాండెజ్.

"అసలు ఈ దేశాన్ని రక్షించే సత్తువా... మీకే వుందని ప్రధానిగారు పెడబొబ్బలు పెడుతున్నారు... అబ్బో... వయసు మీరితే మాత్రం... కాస్తంత దవడలు చప్పిడిపడ్డా మీది సింహనాదమే! ఆహాఁ.. మెలిదిరిగిన మీ కండరాలు... తలనెరిస్తేనేం... మన సాయుధ బలగాలను పాకిస్తాన్‌పై పెురువుదాడులు చేయిస్తున్నారాయె...

"మరే.... మరే...!" ఫెర్నాండెజ్‌గారు 'కెవ్వు'మని పిర్రపక్కకు జరిపి చూసుకున్నాడు - బలిసిన నల్లి... ఓసారి నిక్కి కిచకిచ... వికవికా నవ్వంగానే ఫెర్నాండెజ్‌గారు బిత్తర పోయాడు.

"ఓసినీ... నామానాన నేను సింహాసనం మీద కూర్చుంటే నా పిర్రపీకి పోగులు పెడ్తున్నావ్! ఎవర్నువ్? ఏంటి నీ కథా.... ఆనవ్వేంటీ? నువ్వేంటి?" చిర్రుబుర్రు లాడాడు ఫెర్నాండెజ్.

"ఓయీ మాజీ రక్షణ మంత్రీ... నేను 'కాగ్' కొండిని... నీ పదవికి గండాన్ని... సర్సరె.. పదిలంగా పీఠాన్నెక్కావ్? నన్ను మరిచావా... నీ గట్టుమట్లన్నింటినీ రట్టు చేశావ్!"

"చాల్చాలు... ఇంకా నాకు గుట్టూ మట్టూ రట్టూ ఏం లేవు... ప్రధాని గారే నాకు కితాబులిచ్చేశారు"! ఈ దేశాన్ని రక్షించే భారం నాదే.. నీ తెహల్కాను తుంగలో తొక్కాంగా.. మళ్ళా కుడుతున్నావ్.. సర్సరెగానీ.. అంతా కుశలమే గదా... నా పదవీ... సింహాసనం...!" ఫెర్నాండెజ్‌గారి వీపుమీద నుండి జెట్లీ గారు మిటుకూ మిటుకూ చూస్తున్నారాయె!

"కుశలమంటే ర.మం.గారూ.. కార్గిల యుద్ధంలో మీ అరివీర భీకర విన్యాసాలు ఒకటొక్కటే బయటకు నిక్కి చూస్తుంటేనూ...

"అరెరె... మా రక్షణ దళాలు కుశలమేగదా... నా కార్గిల్ ప్రతాపం... నా సింహాసనం... (వెర్రి నవ్వోటి నవ్వాడు)

"కార్గిల్‌కు మీరు రక్షణ దళాలకు కొనుగోలు చేసిన 91 కోట్ల రూపాయల మందుగుండు తూటాలు కాలం చెల్లిపోయిన తాతల కాలం నాటివని తేలింది...!" కాగ్‌నల్లి కకావికా నవ్వింది.

"అబ్బో.. అబ్బో.. సర్సరె.. నా సింహాసనం.. పదవీ... (నీళ్ళు నమిలాడు ఫెర్నాండెజ్)

"సైన్యానికి అసలు అవసరమే లేని ఆయుధ సామగ్రి 260.55 కోట్లది మీరు విదేశాల నుండి కొని పారేశారు... అదికాదు పాయింటు... అవన్నీ మన దేశంలో తయారయేవే!

"అబ్బో... అబ్బో... (చొంగలు రెండుబొట్లు కార్చాడు ర.మంత్రి)

'347.37 కోటల రూపాయల ఎమర్జెన్సీ ఆయుధ పరికరాలు అనవసరంగా విదేశాల నుండి దిగుమతి చేసుకున్నారు (కాగ్‌నల్లి బాధనభినయిస్తూ అంది)

"అబ్బో... అబ్బో... అయ్యో... నా సింహాసనం... పదవీ... (చెవట్లు తుడుచుకున్నాడు ర.మంత్రి)

"ఘోరం.... ఘోరం... కార్గిల్ మృతవీరుల శవపేటికల భాగోతం దారుణం... లక్షా పదివేలకు ఒక శవపేటిక... అయ్యో... అమెరికా కంపెనీల నుండి దిగుమతి... వాటిని సోమాలియాలో 8500లకే కొనుక్కున్నారు.... ఘోరం... ఘోరం... (బావురుమంది కాగ్ నల్లి)

"మృతవీరుల ఆత్మలకు శాంతి కలుగుగాక... వీరోచితంగా పోరాడారు. వీర మరణం పొందాడు... అమర్ రహే కార్గిల్... జై జవాన్....!"

కాగ్‌నల్లి పిర్రమీద కసిక్కున పొడవడంతో ర.మంత్రి కెవ్వుమని కుర్చీలో ఎగిరిగంతేశాడు.. జయాజెట్లీ కకావికలైంది.

"అయ్యో... మిమ్మల్నేం చేస్తే పాపముంటుంది. మొత్తానికి 2150 కోట్ల రూపాయల కార్గిల్ యుద్ధ సామాగ్రి... యుద్ధం ఆసాంతం పూర్తయిం తర్వాత 99 జులైలో ముట్టింది గదా... దాన్లో ఎన్ని ముడుపులో (కసిక్కు కసిక్కు...)" కెవ్వుమన్నాడు ర.మంత్రి.

"ఎట్లా... ఒకవేపు భీకర యుద్ధం... సైన్యం చస్తున్నారు... వీరలాంఛనాలు... బరువైన శవపేటికలు... రాతివెండివి.. అమెరికా కంపెనీ నుండి డబ్బు రాబడతాం... నేనసలు ఆ సమయంలో పదవిలో లేను...!" ర.మంత్రి అంతన పొంతన లేని మాటలు బడాబడా వాగుతున్నాడు. కాగ్‌నల్లి కసిక్కున మరో రెండు పోట్లు పొడవడంతో శివమెత్తిన వాడిలా కుర్చీమీద నుండి లంఘించి భయభ్రాంతుడై జయ వెనుక దాక్కుని నిక్కి నిక్కి చూస్తున్నాడు! ★

అల్లుడు మంచితనం

లక్ష్మి

నటించడం, జీవించడం రెండూ వేర్వేరు ప్రక్రియలు. నటించేప్పుడు ఆ పాత్రలో జీవించాలి! జీవితంలో నటనకి స్వస్తి పలకాలి! నటించేప్పుడు ఆ పాత్రలో జీవించకపోతే తప్పు! జీవితంలో నటిస్తూ రాణించాలనుకోడం ముప్పు! వదిలేయండి. భూమ్మీద బతికే ప్రతి మనిషీ నటుడు కాలేడు. నటన ఒక పెద్ద ఆర్టు. ఉన్నది లేనట్టూ లేనిది వున్నట్టూ భ్రమ కలిగించాలి. ఇంచుమించు మయసభ లాటిది నటన. నాటకం కావచ్చు. సినీమా కావచ్చు. అందులో నటించే నటుడు - సొంత బతుక్కి సూటుకాని అనేకమైన పాత్రల్లో జీవించాలి. మీరు పరమ శాకాహారులు. మీతత్త్వం మీ మాటలూ మొత్తం వెజిటేరియన్ జాతివే! అల్లాంటి మీరు పక్కా నాన్‌వెజిటేరియన్ వేషం కట్టవలసి వస్తుంది. నా వల్ల కాదంటే మీరు ఏక్టరుగా పనికిరారు. వేరే ఫీల్డు వెతుక్కోమంటారు. మీ జీవన విధానం పక్కా సాత్త్వికమే కావచ్చు. సినీమాలో మీ వేషం కబేళా బ్రాండు. మేకల్నీ, గొర్రెల్నీ చీల్చి చెండాడి తోరణాలు కట్టే వేషం. అల్లాంటి వేషంలో మీరు జీవించగలిగితే మంచి నటుడనే పేరొస్తుంది. అంతేగాని అల్లాంటి సీన్లు నాకు సూటు కావన్నా, ఆ సీన్లు చేసేప్పుడు వాంతులవుతాయని చెప్పినా మీరు నటుడుగా రాణించలేరు! నటించేప్పుడు సొంత గొడవలు అవతల పెట్టాలి!

సినీ నటుడు ప్రాణ్ గురించి - చాలాకాలం క్రితం - సినీమా పేపర్లో చదివేను. ఆచార వ్యవహారాలకు ప్రాణం పెట్టే కుటుంబంలో ప్రాణ్ జన్మించేడు. మద్యం సేవించినా కనీసం సిగరెట్టు ముట్టించినా తప్పు పుట్టేవని తిట్టిపోసే వంశమది! అతను ఆకట్టుబాట్లూ ఆ వాతావరణంలోనే పెరిగేడు! అల్లాంటి మనిషి సినీమాల్లో దరిద్రగొట్టు వేషాలు వేసి రాణించేడు. విలన్ అనే పదానికి అతను నిర్వచనమయ్యేడు. ధారాళంగా సిగరెట్లు కాల్చడం.. విస్కీ బ్రాందీలు తప్పతాగి తూలిపోవడం... హత్యలు చేయడం, చేయించడం... ఆడపిల్లల్ని పాడు చేసే కార్యక్రమంలో అపారమైన ఉత్సాహం ప్రదర్శించడంలాటి వికృత చర్యలతో అతను దుష్టపాత్రధారిగా గొప్పపేరు తెచ్చుకున్నాడు! అతను తెరమీద కనిపించగానే ఆడవాళ్లు భయపడిపోయేవారు. వీడి జిమ్మడ అని తిట్టుకునేవారు. ఆ స్థాయిలో దుష్టపాత్రల్లో జీవించిన ప్రాణ్ - నిజ జీవితంలో ఎంతో మంచివాడు! తల్లితండ్రుల ముందు సిగరెట్టు కాల్చేవాడు కాదు. మంచీ మర్యాదలకు అతను మచ్చుతునక. పెద్దల యందు భక్తితో పాటు ఆడవాళ్ల పట్ల గౌరవం-నిజజీవితంలో అతన్ని జంటిల్‌మేన్‌గా నిలబెట్టేయి! దానధర్మాల్లో అతని చొరవ, స్నేహం పట్ల అతని మమకారం అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి!

అంతనీటు మనిషి సినీమాల్లో పరమనీచమైన వేషాల్లో అద్భుతంగా జీవించేడంటే - నటనకు అతను నిర్వచనమనే చెప్పుకోవాలి. సినీమాల్లో ప్రాణ్‌లాటి నటులు యింకా ఎంతమంది వున్నారో నాకు తెలీదు. విడిచిపెట్టండి. నిజజీవితంలో గూండాగా పేరుబడ్డ వ్యక్తి సినీమాల్లో కూడా గూండాగా నటించి మెప్పించినప్పుడు - అది మేలుజాతి నటనగా పిలవబడదు. నిజజీవితంలో ఏ విధంగా అఘోరిస్తున్నాడో - తెరమీద కూడా అదే చేస్తున్నాడని కొట్టిపారేస్తాం! అదే మనిషి-బడిపంతులు వేషం కట్టి భేషనిపించుకుంటే ఒక్క గూండాయిజంలోనే కాకుండా ఏక్టింగ్‌లో కూడా దిట్ట అని పేరు తెచ్చుకుంటాడు. తెరమీదా, తెరవెనకా నటుల ఫీట్లు గురించి చెప్పదలుచుకోలేదు. ఈ భూమ్మీద భర్త అనే వ్యక్తి మహాగొప్ప నటుడని స్వాభిప్రాయం! సదరు భర్తకు నటనలో ప్రత్యేకించి డిగ్రీలు డిప్లొమాలు లేకపోవచ్చు. సహజ నటుడు. స్టేజిమీదా, వెండితెరమీదా అతని విన్యాసాలన్నీ అతని నటనకు మచ్చుతునకలు. జీవితంలో నటిస్తే దెబ్బతింటారనే సూక్తిని అలవోకగా తీసిపారేసిన

వ్యక్తి! జీవితంలో నటించకపోతే బతకలేమనే నీతికి కట్టుబడిన మనిషి!

అవసరమనిపిస్తే భార్య ముందు ద్విపాత్రాభినయం చేస్తాడు. త్రిపాత్రా, బహుపాత్రాభినయాలకక్కాడా సిద్ధమంటాడు! అవసరాలను బట్టి వేషాలు మారుస్తూ వుంటాడు. ఏది వేషమో, ఏది కాదో అతని భార్యకు తెలీకుండా జాగ్రత్త పడతాడు. ఒక సందర్భంలో ఆమె ఇతడు ధర్మరాజనుకుని మురిసిపోతుంది. ఆ తర్వాత యమధర్మరాజని మూర్ఛపోతుంది. ఇతడు సత్యహరిశ్చంద్రుడని ఆనందిస్తుంది. ఆనక పరమ ఫోర్ట్వంటీగాడని ఆశ్చర్యపోతుంది. ఇతడు కడు దయాశీలి అని చేతులు జోడిస్తుంది. ఆ వెంటనే-కసాయి వాడని కన్నీరు పెట్టకుంటుంది. ఇతడు ఆదర్శపురుషుడని భ్రమపడుతుంది. మరుక్షణంలోనే ఆవేశపరుడని అల్లాడిపోతుంది. ఏది వేషమో ఏది కాదో చెప్పలేని దుస్థితిలో ఆ ఇల్లాలు ఉక్కిరిబిక్కిరి అవుతూ వుంటుంది. కచ్చితంగా ఇతను ఇల్లాంటి మనిషి అని ఆమె బతికుండగా చెప్పలేదు! ఆ అవకాశం అతను ఆమెకు ఇవ్వకుండా బతికినన్నాళ్లూ జాగ్రత్త పడతాడు. అది అతని ప్రత్యేకత!

ఇంటికి అత్తవారొచ్చినప్పుడు ఆలిమీద అపారమైన అనురాగం కురిపిస్తాడు. అదంతా నిజమనుకుని అత్తవారు అల్లుడు మంచితనానికి ముగ్ధులవుతారు. నీ అదృష్టం కొద్దీ దొరికేడని కూతుర్ని అభినందిస్తారు. అంతమంచివాడ్ని అపార్థం చేసుకుంటే కళ్లుపోతాయని కూతుర్ని కోప్పడతారు. నానెత్తిమీద కిరసనాయిలు పోసేడని అమ్మాయి చెబుతుంది. అది సరసమని అత్తవారు సర్ది చెబుతారు. కిరసనాయిల్తో సరసమేమిటని అమ్మాయి అడుగుతుంది. సరసంలో పద్ధతులు మారేయని అత్తవారు బుజ్జగిస్తారు. నేను తాగేపాలల్లో నిద్రమాత్రలు కలిపేడని అమ్మాయి చెబుతుంది. ఆడపిల్లకి అల్లరెక్కువైతే ఏ మొగుడైనా అదే చేస్తాడని అత్తవారు రూలుచెబుతారు. ఎండ్రిన్ లిక్విడ్‌గా దొరుకుతుందా మాత్రల్లో లభిస్తుందాని మొన్నామధ్య అడిగేరని అమ్మాయి ఫిర్యాదు చేస్తుంది. తెలీని వస్తువు ఏ రూపంలో దొరుకుతుందని అడగడం కూడా ఒక తప్పేనా అని అత్తవారు మందలిస్తారు. కట్టుకున్న భార్యకే అంతుబట్టని మనిషి - అత్తమామలకు దొరికిపోతాడనే గ్యారంటీ ఏముంది? ★

చరిత్రకెక్కిన క్రీస్తు మందిరం

మెదక్ చర్చి



హెచ్.రమేష్‌బాబు

మనిషిలోని అనుపమానమైన ధార్మిక భావనకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది చారిత్రాత్మక 'మెదక్ చర్చి'. ఇది దక్షిణ-తూర్పు ఆసియా ఖండంలోనే అతి పెద్దదిగా రికార్డులకెక్కింది. ఆసియా ఖండంలోని అద్భుత కట్టడాల్లో ఒకటిగా చెప్పుకునే ఈ చర్చి దేశ విదేశాల పర్యాటకులను ఆకర్షిస్తుంది. దీని నిర్మాణం ఏదో మత వ్యాప్తి కొరకో, ధనవంతుల పేరు ప్రఖ్యాతుల కొరకో జరిగింది కాదు. ఒక సామాజిక ప్రయోజనం కోసం నిర్మితమైంది.

1914-18 మధ్యకాలంలో మెదక్ జిల్లాలో నెలకొన్న తీవ్ర అనావృష్టి పరిస్థితులను ఎదుర్కోవడానికి 'పనికి ఆహార పథకం' క్రింద ఈ చర్చి నిర్మాణపు పనులు చేపట్టారు. కరువు కరాళనృత్యం చేస్తూ ఆకలి చావులు సంభవిస్తున్న సమయంలో 1914లో నిర్మాణ పనులు ప్రారంభమై 1924 వరకు కొనసాగాయి. అదే సంవత్సరం డిసెంబర్ 25 క్రిస్టమస్ రోజున ఈ చర్చిని జాతికి అంకితం చేశారు.

ఈ మెదక్ చర్చి నిర్మాణానికి మార్గదర్శకత్వం వహించిన వారు 'రెవరెండ్ చార్లెస్ వాకర్ పాస్నేట్'. ఇంగ్లండ్‌కు చెందిన పాస్నేట్, ప్రఖ్యాత శిల్పి. జె.సాలిస్ ఒరీ దీనికి రూపకల్పన చేశాడు. దీని నిర్మాణంలో పాస్నేట్



పలు నూతన విధానాలను పాటించి నిర్మాణ రంగంలో మౌలిక మార్పులకు శ్రీకారం చుట్టాడు. నాటి ఇంగ్లండ్ సాంప్రదాయిక వస్తువులైన రాయి, కలపలకు బదులు ఉక్కు, సిమెంట్, కాంక్రీట్‌లను వినియోగించాడు. ఈ విధానం నిర్మాణ రంగంలోనే నూతన ప్రక్రియగా చెప్పుకున్నారు ఆ రోజుల్లో.

మెదక్ నగరం నడిబొడ్డునగల ఈ చర్చి యూరప్ దేశపు గాతిక్ శైలిలో రూపొందింది. ఈ నిర్మాణం ఎత్తు 173 అడుగులు, పొడవు 200 అడుగులు, వెడల్పు 100 అడుగులు. అవసరాలకు తగ్గట్టుగా గృహ నిర్మాణ రంగంలో నిపుణులు అంతగా లేని ఆ రోజుల్లో నైపుణ్యం లేని పని వారితోనే తను అనుకున్న రీతిలో నిర్మాణాన్ని కొనసాగించాడు పాస్నేట్. నాటి నిజాం నవాబు చర్చి నిర్మాణానికి అనువైన భూమిని విరాళంగా ఇవ్వగా, చర్చి ప్రధాన ద్వారాన్ని ఒక హిందూ భక్తుడు ఇచ్చాడని పెద్దలు చెబుతారు. అవసరమైన విడి భాగాలన్నిటినీ ముందుగానే తయారు చేసుకుని, తరువాత వాటిని క్రమంగా కలపడం అనే నూతన ప్రక్రియతో ఈ చర్చిని నిర్మించి ఆధునికీకరణకు పునాది వేశారు. మన దేశంలో ఈ తరహా నిర్మాణం ఇది ప్రప్రథమం. దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాల శిల్పులను, వడ్రంగులు, చిత్రకారులతో బాటు ఇటలీ నుండి నిర్మాణ పని వారలను రప్పించి పాస్నేట్ ఈ చర్చిని నిర్మించారు. కాగా నిజాం నవాబు ఆంక్షలు విధించినందువల్ల చర్చి టవర్ నిర్మాణాన్ని చార్మినార్ ఎత్తుమించకుండా జాగ్రత్త పడ్డారనీ చెబుతారు. చార్మినార్ కన్నా ఈ చర్చి ఎత్తు కేవలం నాలుగడుగులు తక్కువని అంటారు.

ఈ చారిత్రాత్మక చర్చికి విశిష్టతను ఆపాదించి పెట్టేది ముఖద్వారానికి ఎదురుగా, ఇరువైపులా వున్న అద్దాల కిటికీలు, రంగు రంగుల అద్దాల అలంకరణతో కూడిన గవాక్షాలు. కిటికీలకున్న అద్దాలపై క్రీస్తు పుట్టుక దృశ్యాలతో మొదలు శిలువ దృశ్యం, పునర్జీవితుడైన దృశ్యమాలికలు చూపరులను కట్టిపడేస్తాయి. ఈ చిత్రాలన్నీ మనకు సూర్యకాంతిలో మాత్రమే కనిపిస్తాయి. విద్యుత్ దీపాల వెలుతురులో కనిపించవు. చర్చిలోపలి భాగంలో ఎంత జనసందోహం వున్నా రీసౌండ్ వినిపించకపోవడం నాటి నిర్మాణ నిపుణతకి, వైచిత్రికి నిదర్శనం. ఆ రోజుల్లో ఈ చర్చి నిర్మాణానికి 32 లక్షలు ఖర్చయింది. ఆకాశానికి అందేలా 55 మీటర్ల ఎత్తులో నిర్మితమైన ఈ చర్చి ప్రపంచంలోకెల్లా అత్యున్నత నిర్మాణాల్లో ఒకటిగా వాసికెక్కింది.

చారిత్రక ప్రాశస్త్యం, నిర్మాణ వైశిష్ట్యాలతో అలరారుతున్న మెదక్ చర్చి ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్నది. నిత్యం దేశ, విదేశాల యాత్రికుల సందర్శనతో కిటకిటలాడుతుంటుంది. సెలవురోజుల్లో చర్చిని చూడటానికి వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఇక క్రిస్టమస్ పండుగ సందర్భాల్లోనైతే వారం రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. పండుగ అలంకరణలు చర్చి అందాలను మరింత ఇనుమడింప చేస్తాయి. అనునిత్యం ఇక్కడికి వచ్చే వారిలో క్రైస్తవులకన్నా హిందూ ముస్లింలే ఎక్కువగా ఉండటం విశేషం. ఎందరో గవర్నర్‌లు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ముఖ్యమంత్రులు, దేశవిదేశీ ప్రముఖులు ఈ చర్చిని సందర్శించిన వారిలో వున్నారు. క్రిస్మస్ నాడు ఈ చర్చిని యాభైవేల మంది సందర్శిస్తారు.

1945లో సామాజిక సేవ లక్ష్యంగా 'చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా' అధ్యక్ష మండలి ఏర్పడింది. ఈ మండలి క్రిస్టియన్ మిషనరీల చర్చ్‌ల నిర్వహణతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నది. మెదక్ డయాసిస్ పరిధిలోని మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ కళాశాలతో బాటు నాలుగు డిగ్రీ కళాశాలలు, ఎనిమిది జూనియర్ కళాశాలలు, పందొమ్మిది హైస్కూళ్ళు, ఎనిమిది ప్రాథమిక పాఠశాలలు, 22 హాస్టళ్ళు, శిశు సంరక్షణ కేంద్రాలు, ఏడు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఎనిమిది టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లు, 80 గ్రామీణ నర్సరీ స్కూళ్ళు, ఒక వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. వీటితో బాటు స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారుల శిక్షణా కేంద్రాన్ని వడియారంలో, ఇంకా పాపన్నపేట, ఎల్లారెడ్డిల్లో రూరల్ పాలిటెక్నిక్ పాఠశాలలు నడుపుతున్నారు. వీటితోబాటు ఆయా జిల్లాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పండ్ల తోటలు, సామాజికవనాల పెంపకం చేపట్టారు. ఇలా సామాజిక సేవా రంగంలో మెదక్ చర్చి అధ్యక్ష మండలి చేస్తున్న కృషి ఎంతైనా అభినందనీయం.

ప్లాటినమ్ జూబ్లి ఉత్సవాలను పూర్తి చేసుకున్న మెదక్ చర్చి గత శతాబ్దపు నిర్మాణ కౌశలానికి నిదర్శనంగా నిలవడమే గాక, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తున్నది. అంతేకాదు ప్రపంచంలోని అతి పెద్ద చర్చిల్లో ఒకటిగా చరిత్రకెక్కింది ఈ మెదక్ కేథెడ్రల్ చర్చి. ★

మళ్ళీ స్వర్ణయుగం వైపుగా హాకీ...!

మారేపల్లి లక్ష్మణ్

జాతీయ క్రీడైన హాకీకి మళ్లీ పునర్ వైభవం వస్తున్న చాయలు అగుపిస్తున్నాయి. సీనియర్ జట్టులో జూనియర్ ఆటగాళ్ల ఆగమనం భారత్ హాకీ దశను మార్చివేస్తున్నది. తాజాగా మలేషియాలో జరిగిన ఛాంపియన్స్ ఛాలెంజ్ ట్రోఫీని భారత్ నెగ్గి ఏడేళ్ల విరామం తర్వాత ఆరు అగ్రదేశాలు తలపడే ఛాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించింది. ఛాంపియన్స్ ఛాలెంజ్ కప్‌ను గెలుచుకున్న సీనియర్ జట్టులో సగం మంది ఇటీవల జూనియర్ వరల్డ్ కప్‌ను గెలుచుకున్న కుర్రాళ్లే కావడం విశేషం. సీనియర్లు 32 ఏళ్ల తర్వాత ఆసియా గేమ్స్‌లో స్వర్ణం అందుకోవడం... కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియా, అజ్లాన్‌షా కప్‌లలో కాంస్యాలను గెలవడం... అక్టోబర్‌లో జూనియర్లు మొదటి సారి జూనియర్ వరల్డ్ కప్‌ను గెలవడం... సీనియర్ మహిళల జట్టు వరల్డ్‌కప్‌కు అర్హత సాధించడం.... ఇపుడు ఛాలెంజ్ ట్రోఫీని సాధించడం... ఇవన్నీ భారత్‌కు బంగారు భవిష్యత్తుపై ఆశలు నింపుతున్నాయి.

మూడు, ఐదు దశకాల్లో స్వర్ణం యుగం

మూడు, ఐదు దశకాలలో భారత హాకీకి స్వర్ణం యుగం లాంటిదే. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ స్టిక్‌తో చేసిన మ్యాజిక్‌కు స్వర్ణం రాలేదు. మొదటి సారి 1928లో జైపాల్‌సింగ్ కెప్టెన్సీలో హాకీ స్వర్ణం సాధించిన భారత్ ఆ తరువాత వరుసగా 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్ వరకు ఆరు స్వర్ణాలతో ఎదురులేని జట్టుగా కొనసాగింది. అయితే మొదటి సారి 1960 రోమ్ ఒలింపిక్స్‌లో భారత్ జైత్రయాత్రకు పాకిస్థాన్ అడ్డుకట్ట వేసి స్వర్ణాన్ని ఎగరేసుకొని పోయింది. ఆ తరువాత జరిగిన 1964 టోక్యో ఒలింపిక్స్‌లో చరణ్‌జిత్ సింగ్ నేతృత్వంలో మళ్లీ స్వర్ణ పతకం గెలుచుకొని

పూర్వవైభవాన్ని సంతరించుకొంది. ఇక అక్కడి నుండి భారత్ హాకీ ప్రమాణాలు దిగజారుతూ వచ్చాయి. మరో పదహారేళ్లకు గాని ఒలింపిక్స్‌లో స్వర్ణయుగం ప్రారంభం కాలేదు. చివరిసారిగా 1980 మాస్కో ఒలింపిక్స్‌లో భాస్కరన్ నాయకత్వంలో స్వర్ణం గెలుచుకున్న భారత్‌కు ఒలింపిక్స్‌లో అదే చివరి పతకం. అప్పటి వరకు జరిగిన పదకొండు ఒలింపిక్స్‌లో ఏదో ఒక పతకాన్ని గెలుచుకున్న భారత్ ఆ తరువాతి ఒలింపిక్స్‌లో కనీసం పతకం ఛాయలకు కూడా వెళ్లలేక పోయింది. యూరప్ రంగప్రవేశంతో హాకీలో వేగానికి ప్రాధాన్యత పెరగడం కూడా భారత్ తిరోగమనానికి ప్రధాన కారణం. సంప్రదాయ హాకీకి అలవాటు పడ్డ భారత్, యూరప్ హాకీ ప్రమాణాలను అందుకోలేక పోయింది.

భారత్‌కు ఛాలెంజే

ఛాంపియన్స్ ఛాలెంజ్ టోర్నీ రౌండ్ రాబిన్‌లీగ్‌లో బెల్జియంపై 1-0తో గెలుపొంది శుభారంభం చేసిన తర్వాతి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్ డ్రా కావడం, మలేషియా చేతిలో పరాజయంతో భారత్ పని అయిపోయినట్లే అని విమర్శకులు విమర్శల బాణాలు వదిలారు. ఇది ఛాలెంజ్‌గా తీసుకొన్న సీనియర్ జట్టులోని జూనియర్లు దీపక్ ఠాకూర్, గగన్‌జిత్‌సింగ్, అర్జున్‌హాలప్పలు చక్కని ఆటతో భారత జట్టు జపాన్‌పై 3-0తో, అర్జెంటీనాపై 2-1 విజయంతో ఫైనల్లో ప్రవేశించింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి ఛాలెంజ్ ట్రోఫీని కైవసం చేసుకొని తమలో చేవకు కొదవలేదని ఛాలెంజ్ చేసింది. అగ్రశ్రేణి జట్లులేని ట్రోఫీలో విజయం సాధించినా అది త్వరలో జరగనున్న ప్రపంచకప్‌కు ముందు లభించడం భారత ఆటగాళ్లలో అణగారిన ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలుపుతుంది. యూరప్ జట్లు ఆస్ట్రోటర్ఫ్ లాంటి ఆధునిక పిచ్‌లపై వేగవంతమైన ఆటను ప్రదర్శిస్తుంటే, ప్రతిభకు కొదవలేని భారత ఆటగాళ్ళు అలాంటి సదుపాయాలకు ఆమడదూరంలో వున్నారు. మన ఆంధ్రప్రదేశ్ విషయానికే వస్తే హైదరాబాద్‌లో ఒక్క ఆస్ట్రోటర్ఫ్ మైదానం తప్పిస్తే రాష్ట్రంలో మరెక్కడా అలాంటి సదుపాయం లేదు. ఇదే పరిస్థితి అన్ని రాష్ట్రాలలోనూ వుంది. ఇలాంటి పరిస్థితులలో జట్టు అద్భుత విజయాలను సాధించాలని అనుకోవడం అత్యాశే అవుతుంది. యూరప్ జట్ల వేగాన్ని అందుకోలేవు కూడా. పెరుగుతున్న ఆధునిక సదుపాయాలు భారత ఆటగాళ్లకు కూడా కల్పిస్తే తాము యూరప్ జట్లకు తీసిపోమని నిరూపించగలుగుతారు. ఇలాంటి ఛాలెంజ్‌లను ఎన్నింటినో సగర్వంగా తీసుకురాగలరు.

ఛాంపియన్స్ ఛాలెంజ్ కప్ సాధించిన తీరు...

(రౌండ్ రాబిన్ లీగ్‌లో)

ప్రత్యర్థి	స్కోరు	ఫలితం
బెల్జియం	1-0	గెలుపు
దక్షిణాఫ్రికా	2-2	డ్రా
మలేషియా	1-2	ఓటమి
జపాన్	3-0	గెలుపు
అర్జెంటీనా	2-1	గెలుపు
(ఫైనల్లో)		
దక్షిణాఫ్రికా	2-1	గెలుపు

ఒలింపిక్స్‌లో భారత్

1928	ఆమ్‌స్టర్‌డామ్	స్వర్ణం
1932	లాస్‌ఏంజెల్స్	స్వర్ణం
1936	బెర్లిన్	స్వర్ణం
1948	లండన్	స్వర్ణం
1952	హెల్సింకి	స్వర్ణం
1956	మెల్‌బోర్న్	స్వర్ణం
1960	రోమ్	రజితం
1964	టోక్యో	స్వర్ణం
1968	మెక్సికో	కాంస్యం
1972	మ్యూనిచ్	కాంస్యం
1980	మాస్కో	స్వర్ణం

ఏషియన్ గేమ్స్‌లో భారత్

1958	టోక్యో	రజితం
1962	జకార్తా	రజితం
1966	బ్యాంకాక్	స్వర్ణం
1970	బ్యాంకాక్	రజితం
1974	టెహ్రాన్	రజితం
1978	బ్యాంకాక్	రజితం
1982	న్యూఢిల్లీ	రజితం
1986	సియోల్	కాంస్యం
1990	బీజింగ్	రజితం
1994	హిరోషిమా	రజితం
1998	బ్యాంకాక్	స్వర్ణం



1998లో జరిగిన బ్యాంకాక్ ఏషియన్ గేమ్స్‌లో భారత్ 32 ఏళ్ల సుదీర్ఘ విరామానంతరం హాకీ స్వర్ణాన్ని గెలుచుకుంది. దాని తర్వాత సీనియర్ హాకీ జట్టు సాధించిన ఏకైక ట్రోఫీ ఛాంపియన్స్ ఛాలెంజే. జూనియర్ల జూనియర్ వరల్డ్ కప్ విజయంతో మొగ్గతొడిగిన ఆశలు సీనియర్ల ఈ ఛాలెంజ్ కప్‌తో చిగురిస్తున్నాయి. హాకీకి బంగారు భవిష్యత్తు ఎంతో దూరంలో లేదని యూరప్ జట్లతో పోటీపడే లాగా క్రీడా సౌకర్యాలను కల్పిస్తే స్వర్ణ యుగాన్ని తేగలమని సీనియర్లుగా మారుతున్న జూనియర్లు హాకీ స్టిక్‌తో బదులు చెబుతున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తే హాకీ పూర్వ వైభవం సంతరించుకొనే రోజు మరెంతో దూరంలో లేదు....

కప్‌ను సాధించిన భారత జట్టు

జూడో మెంజెస్(గోల్ కీపర్), లాజరస్ బార్లా, తిరుమల్‌వరన్, ఎస్.ఎస్.గిల్, బల్జీత్‌సింగ్ థిల్లాన్, ప్రభుజ్యోత్‌సింగ్, జుగ్‌రాజ్‌సింగ్, దల్జీత్‌సింగ్ థిల్లాన్, అర్జున్ హాలప్ప, దీపక్ ఠాకూర్, బిపిన్ ఫెర్నాండెజ్, విక్రమ్ పిళ్లై, గగన్ అజిత్‌సింగ్ ★

హిరణ్యాక్షుడు

కాలువ మల్లయ్య

(గతవారం తరువాయి)

ఈ మాటలంటున్నది నా విమలేనా...? తన భర్త వేరొక స్త్రీతో కొంత సమయం కోసమైనా గడపటానికి సహించని విమలేనా ఈమె...? విమల మాటలు విన్న నేను కొద్దిసేపటి వరకు కోలుకోలేదు.. ఆమె పక్కనుంచి కొంచెం దూరం జరిగాను..

"అంటే...? డబ్బు బాగా సంపాదిస్తే ఎన్ని వెధవపనులు చేసినా ఫర్వాలేదంటావా...?"

"శ్రీలతను మధుసూదన్ సంపదల్లో ఓలలాడిస్తున్నాడు కదా...! బాగానే చూసుకుంటున్నాడు కదా...! లక్షలకు లక్షలు డబ్బు సంపాదించిన వాడు చిన్నతప్పు చేస్తే భార్యగా శ్రీలత ఓర్చుకోవద్దా...? తనకేదయినా లోటు చేస్తే బాధపడాలి గాని అనవసరంగా అల్లరి చేయడమెందుకు...?"

విమల మాటల్ని నేను భరించలేకపోతున్నాను..

అంటే...? అంటే...? బాగా డబ్బుంటే తన భర్త ఇతర్లతో సంబంధం పెట్టుకున్నా ఫర్వాలేదన్నమాట. తన భర్త తనకే చెందాలనడంలో ఎంత ప్రేముంది..? బాగా డబ్బుంటే ఎవరితో సంబంధం వున్నా ఫర్వాలేదనడంలో ఎంత అమానుషతుంది...

నా మనసు విలవిలా కొట్టుకుంటుంది.. విమలదిక్కు ఆశ్చర్యంగా చూస్తున్నాను.. "అంటే...?; విమలా...? నేను బాగా సంపాదించి నీకిచ్చాననుకో... అప్పుడు నేనెవరితో సంబంధం పెట్టుకున్నా ఫర్వాలేదన్నమాట...!"

నవ్వురాకున్నా నవ్వుతూనే అన్నాను..

"అంతేమరి...! అంత డబ్బున్న తర్వాత ఇంకేం కావాలి...? అయినా మీకేం చేతనవుతుంది డబ్బు సంపాదించడం..?"

"కొద్ది నిమిషాల కొరకు సంపాదించాననే అనుకుందాం..."

"ఫర్వాలేదని చెప్పాను కదా...! అయినా మీతో వచ్చేదెవతి...?"

"ఏం...? నాకేమైంది..?"

"మీ అందాన్ని, రంగును చూసి ఏ ఆడది మీ దగ్గరి కొస్తుంది...?"

మొదటిసారిగా విమల నోటినుంచి నా అందం ప్రస్తావనవచ్చింది.... నా హృదయం తీవ్రంగా గాయపడింది... నన్ను మనసారా ఇష్టపడి చేసుకున్నానని చెప్పిన విమల, నా హృదయం నిండా తానే అయి వున్న నా అర్ధాంగి అందం పేరు మీద నన్ను కించపరచడం నాకు తీరని వేదనగానే ఉంది..

"మరి నువ్వప్పుడెలా అంగీకరించావు పెళ్ళికి..?"

"తెలిసీ తెలియని వయసు... అప్పుడెలా ఇష్టపడ్డాను తెలియదు... ఇప్పుడయితే చచ్చినా చేసుకునే దాన్ని కాదు..."

ఆ మాటలు నాకు రంపపు కోతగానే వున్నాయి... నా ఛాతీ మీద పడుకొని నా తల వెంట్రుకల్లోంచి చేతులు పోనిస్తూ నన్ను చేసుకోవడమే తన అదృష్టమని చెప్పిన విమల ఇలా మాట్లాడటం నాకు తీరని వేదనగానే ఉంది. నా నవనాడులూ కృంగిపోతున్నాయి...

ఆ తర్వాత నాకామె మాటల్లో మార్దవం కనబడటం లేదు. స్పర్శలో అనురాగం, ఆప్యాయతలున్నట్లనిపించడం లేదు. ముఖంలో ముగ్ధత్వం తొణికిసలాడటం లేదు..

నేనెంత ప్రయత్నించినా మా మధ్య దూరం పెరుగుతుందే కాని తగ్గడం లేదు.. "విమలా...! నువ్వెందుకిలా మారిపోతున్నావు...? ఇదువరకటి కంటె మనం ఆర్థికంగా మంచి స్థితిలోనే వున్నా నీకే అసంతృప్తెందుకు...? ఎక్కువ డబ్బు మాత్రమే ఎక్కువ సుఖాలనిస్తుందనుకుంటే మనం ఇదివరకటి కంటే ఎక్కువ సుఖంగా ఉండాలి గదా...! వున్నామా మరి...?"

మరో రోజన్నాను మేమిద్దరమే ఇంట్లో వున్నప్పుడు...

"మీరు సంపాయించారా..? ఏంటి మీరు సంపాదించింది...? ఇప్పటి లెక్కల్లో మీ సంపాదనో సంపాదనేనా...? భిక్షగాళ్ళు కూడా ఇంతకంటెక్కువే సంపాదిస్తున్నారు.. ఇదో సంపాదనట..." అంది విసురుగా...

"విమలా...! నువ్వు మంచి పుస్తకాలు చదవడం లేదు.. కృత్రిమ విలువలు, అవాస్తవిక సంఘటనల మాయలో పడి నువ్వు నువ్వు కాకుండా పోతున్నావు...! కొంచెం జాగ్రత్తగా ఉండు... వివిధ ప్రభావాలు పడనీయకు...""

"ఏంటండీ జాగ్రత్తగా ఉండేది....? ఊరందరిదీ ఒకదారయితే ఉలిపికట్టెదొక దారన్నట్టు ఇపుడు పుస్తకాలు చదువుతున్నదెవరు...? మీలాంటి పిచ్చివాళ్ళు తప్ప... ఏం కష్టపడకుండా ప్రపంచాన్నంతా ఇంట్లోంచే చూడగలుగుతుంటే పుస్తకాలు చదివే దెవరు...?"

ఆమె ప్రతిమాటా నాకు షాక్ గానే ఉంటుంది....

"విమలా...! నువ్వెందుకిలా మారిపోతున్నావు...? ఆ రోజు మధుసూదన్‌ను అలా సమర్థించావు.. మధుసూదన్ చేసినట్టే శ్రీలత చేసిందనుకుందా... నేను నీకన్ని విధాలుగా సుఖాలనిస్తున్నాను కదా నేనెవరితో తిరిగితే నీకేంటి అంటే మధుసూదన్ పరిస్థితేంటి...? పోనీ నువ్వేమంటావు...?"

"మనకవసరం లేని మాటలెందుకు...?" అని లేచిలోనికి వెళ్ళింది...

ఆమె అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతూనే ఉంది... ఫ్రిజ్ నిండా కూరగాయలున్నా ఏం పాడయ్యాయి యింట్లో అంటుంది.. ఇంట్లో ఎన్ని పండ్లున్నా లేని పండ్ల గూర్చి గొణుగుతుంది... డబుల్ డోర్ ఫ్రిజ్.. రిమోట్ టీవీ... అలమారాలు.. ఖరీదైన సోఫాసెట్టు.. డిజైన్డ్ మంచాలు... డ్రెస్సింగు టేబుల్... లాంటి అన్ని రకాల ఫర్నీచరున్నా ఇంట్లో లేని ఏదో వస్తువు గూర్చి మాట్లాడుతుంది.. ఇంట్లో ఖరీదైన వస్తువులే వున్నా టీవీలోనో, మరెక్కడో చూసిన వస్తువు గూర్చి మాట్లాడుతుంది. రాజును చూసిన కండ్లతో మొగుణ్ణి చూస్తే మొత్తబుద్ధయినట్టు ఆమె ఆలోచనలెక్కడెక్కడో విహరిస్తుంటాయి..

విమల ఇపుడు పల్లెలకు పోవడానికి కూడా ఇష్టపడటం లేదు.. "ఆ పల్లెల్లో ఏం పాదయింది...? అంతా మురికి... మీవి మురికి బుద్ధులే కాబట్టి మీకు పల్లెలు నచ్చుతాయి.."

నేను పెళ్ళి చేసుకున్నప్పటి కొండిజడ పిల్లకూ ఇప్పటి విమలకూ ఎంత తేడా...?

కాలం గడుస్తుంది.. విమల మీద ఏవేవో ప్రభావాలు పడుతూనే వున్నాయి. మధ్యాహ్న సమయం.. ఇంట్లో ఎవరూ లేరు.. భోజనం చేసి మంచంలో వడుకున్నాను.. వని ముగించుకొనొచ్చి నా ప్రక్కకొరిగింది విమల... ఆమె మీద చెయ్యేసాను.

"విమలా...! మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టే ఉంది రైతు పరిస్థితి... ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోతూ ఆత్మహత్యలు చేసుకుంటుంటే కొత్త సమస్యలొచ్చి పడుతున్నాయి.. బియ్యం కూడా విదేశాల్నుంచి వస్తుంటే గిట్టుబాటు ధరేమోకాని వున్న ధరే తగ్గుతుంది.. దాంతో రైతు పరిస్థితి మరింత దిగజారుతుంది.. ఆరేడు వందలకు క్వింటాల్ చొప్పున విదేశీ బియ్యం దొరకబోతున్నాయి... ఇక మన బియ్యమెవరు కొంటారు...;" అన్నాను..

"తక్కువ ధరకు దొరికినపుడు ఏ దేశపు బియ్యమైతేంది...?

"మరి మన వ్యవసాయమేం కావాలి...?"

"గంగలో కలుస్తాయి... మన కెందుకట...? మీరే వ్యవసాయం చేసినట్టు బాధపడవద్దిరి...."

ఆమె పై నుండి చేతులు తీసాను.. నా ప్రక్కనే వున్నా ఆమె నాకిప్పుడెంతో దూరంలో వున్నట్టు కనబడుతుంది. ప్రౌఢవయసులో నిండైన అందాలతో ఆకర్షణీయంగానే వున్నా విమల మాటలు నన్నామె నుండి వికర్షించుకునేట్టు చేస్తున్నాయి... ఇక నేనేం మాట్లాడలేదు..

"మిమ్మల్ని చేసుకొని నేనేం సుఖపడ్తున్నట్టు....?" అంది విమల... ఆ మాటలు నాకు మరింత షాక్‌నిచ్చాయి...

ఆమెకు కొంచెం దూరం జరిగాను.. "ఏంటోయ్...! నీకేం తక్కువైంది...? అప్పుడు నండూరి వారి ఎంకిలా ఉంటే దానివి... ఇప్పుడు కృష్ణశాస్త్రి ఊర్వశిలా అయ్యాను... అప్పుడు లేలేత కొమ్మలా ఉండేదానివి.. ఇప్పుడు ప్రౌఢ గంభీరవయ్యావు... అపుడు నువ్వు నాన్ మెట్రీక్‌వు.. నా దగ్గర కూచోబెట్టుకొని ఒక్కో పదం వివరిస్తూ నీతో డిగ్రీ పూర్తి చేయించాను.. అంటే నివ్విప్పుడు పట్టభద్రురాలివన్నమాట... మనం ఇల్లు కట్టుకున్నాం... పిల్లలు ఓ.కే.. ఇంకేం కావాలో చెప్పు...? ఏం తక్కువైందని...?"

"మీవన్నీ దరిద్రపు పోలికలు... అల్ప సంతోషపు బుద్ధులు.... నన్ను ఇంత పొడుగు చదివించానని మురిసిపోతున్నారా...? ఆ చదువు వల్ల నా కొరిగిందేంటి...?"

"పి.జి. చెయ్యమని ఫీజు కట్టాను.. పుస్తకాలు తెచ్చాను... మధ్యలోనే వదిలి పెట్టావెందుకు...? నువ్వు మొదట్లో ఉంటే పి.జి. కూడా పూర్తి చేసేదానికి కదా...! అలా అయితే ప్రైవేట్ పాఠశాలలో రెండు మూడు వేలయినా సంపాదించేదానివి కదా...!"

"నేను సంపాదించింతర్వాత మీరెందుకున్నట్టు....? ఈ చదువులు బొంద మీద పెట్టుకోనా...? ఒక్కొక్కరు ఎంత సంపాదించారో మీకు తెలియదా...? మిలియన్లు సంపాదించారు..."

"నాతో ఉద్యోగం చేస్తున్న వాళ్ళు నాలాంటి జీవిత నేపథ్యమున్న వాళ్ళు నాకంటెక్కువ సంపాదించిన వాళ్ళెవరూ లేరు.. ఎవరెవరో అవినీతిపరులతో, దొంగ సంపాదనా వరులతో పోలుస్తూ నన్నెందుకు కించపరుస్తావు...? దీనివల్ల నీకేమొస్తుంది...?"

"డబ్బు సంపాదించే వాళ్ళను పొగిడితే మీకెందుకంతమంట....?"

"ఏ విలువలూ, నీతి నియమాలు లేకుండా అయినా సంపాదించాలంటావు..."

"విలువలా....? అంటేంటి...? అవెలా ఉంటాయి...? అని అడుగుతున్న కాలంలో మీరింకా విలువలని పట్టుకు వేలాడుతున్నారు... అందుకే మన బతుకిలా ఏడ్చింది..."

ఆమె నుంచి మరికొంత పక్కకు జరిగాను... మార్గమేదైనా సరే విపరీతంగా సంపాదించిన వాడే పూజనీయుడు అనే మార్గంలోనే విమల కూడా ఆలోచించడం నాకు దుఃఖాన్నే కలిగిస్తుంది. రచయితగా నాకు లభిస్తున్న గౌరవం, పురస్కారాలు, స్వల్పమైన ఆదాయం జీతానికి ఆదనమే అయినా ఆమె కళ్ళకేమాత్రం ఆనడం లేదు..

పాతికేళ్ళు సంసారం చేసిం తర్వాత పిల్లలు కూడా జీవితంలో స్థిరపడుతున్న సమయంలో విమల అన్న మాటలు నాకెంతో మనస్తాపాన్ని కలిగించాయి.

"ఏం సుఖం పొడయిందీ బతుకులో... నా జీవితం భగ్నమే అయింది... నిస్సారమైంది.. నన్ను మీకిచ్చి నా బతుక్కి అన్యాయం చేసారు మా వాళ్లు..."



ఆమె మాటలు నాకు గుండెకోతగానే వున్నాయి. ఎవరి కోసమయితే, ఏ కుటుంబం కోసమయితే నాకంటూ ఏం మిగుల్చుకోకుండా శాయశక్తులా ప్రయత్నిస్తున్నానో ఆ కుటుంబ యజమానురాలు... నా అర్ధాంగి నోటి నుండే ఇలాంటి మాటలు రావడం నాకు హృదయ శల్యంగానే వుంది. ఎవరైతే సుఖంగా, హాయిగా వుండాలని కోరుకుంటున్నానో వాళ్ళకే ఈ జీవితంలో సుఖం కనబడకుంటే ఆ జీవితానికి, సంపాదనకు అర్థమేంటి...? నా కళ్ళకు హాయిగానే ఉన్నట్టున్న బతుకు ఆమెకెందుకు నిస్సారంగా కనబడుతుంది...? ఆమేం జవాబిస్తుందో తెలిసినా ఆ మాటలే అన్నానామెతో..

నా మాటలకు తోకతొక్కిన పాములా లేచింది విమల...

"ఒక్కొక్కరు హైదరాబాద్‌లో బంగ్లాలు... మారుతీకార్లు... ఇండికాలు సంపాదించుకొని ఎంజాయ్ చేస్తుంటే మీకీ బిచ్చపు బతుకు సుఖంగా అనిపిస్తుందా..? మీ జీతమో జీతం మన బతుకో బతుకా...? ఈ మాత్రం సుఖానికి ఉన్నొక్క పిల్లవాణ్ణి ఇదే బిచ్చపు బతుకు బతకమంటారా...? మీ ఏడాది ఏడాదిన్నర జీతం అమెరికాలో ఉద్యోగం చేసేవాళ్ళ ఒక్కనెల జీతానికి సరిపోదు... ఇదో సుఖమట... ఇదో జీవితమట..."

ఆ మాటలకు నివ్వెర పోవడం తప్ప ఏం చేయాలో తోచడం లేదు... కొద్దిసేపు నేనేం మాట్లాడలేదు...

"ఎంతోమంది కనీసావసరాలు కూడా తీరకుండా బాధపడ్తుంటే నీకే జీవితంలో సుఖం కనబడకుంటే ఎలా...? ఈ దేశంలోని మెజారిటీ జనాల కంటే మనం సుఖంగా బతుకుతున్నామన్న స్పృహ నీకుంటే మంచిది... నాకు బాగానే కనబడ్తున్న బతుకు నీకు చెత్తగా కనబడ్తుందెందుకు...? డాలర్లు సంపాదిస్తేనే సంపాదించినట్టా...?" అన్నాను...

"బాగా సంపాదించానని మురిసిపోతున్నారు కదా...! మీ ఇన్నేండ్ల సంపాదన అమ్మాయి పెండ్లి కట్నానికే సరిపోదు.. అటెనుక చిప్పలే కదా...! నా దేశం, నా ప్రజలంటూ నగటు ఆదాయమంటూ మడిగట్టుకొని కూర్చుంటే బిచ్చపు బతుకే మరి..."

నేనింతకాలంగా కుటుంబం కోసం పడ్డ కష్టాలు, సంపాదించిన సంపాదన అంతా ఒక్క మాటతో బూడిదలో పోసిన పన్నీరులా మార్చేసింది.. విమల రోజు రోజుకూ నాకు దూరమవుతుంది. అందుక్కారణం మా ఆర్థిక దుస్థితీ కాదు.. మరేమిటి? విమలకే తెలియని

(మిగతా 23వ పేజీలో)

విహంగలోకనమ్



కవితాలోచనమ్
రచన : డా॥ రావిరంగారావు,
సాహితీమిత్రులు, మచిలీపట్నం,
వెల : రూ.60, పేజీలు : 112,
ప్రతులకు : నర్రా ప్రభావతి, 27-431,
పాతరామన్నపేట, మచిలీపట్నం-1

డాక్టర్ రావి రంగారావు గత ఇరవై సంవత్సరాలుగా తాము రాస్తూ వచ్చిన సాహిత్య వ్యాసాల నుండి ఎంపిక చేసిన వ్యాసాలను "కవితాలోచనమ్"గా అందజేస్తున్నారు.

ఇందులో వున్న వ్యాసాలన్నీ కవిత్వానికి ముఖ్యంగా ఆధునిక కవిత్వానికి సంబంధించినవి. ఇందులో పదవిభజన చేసి 'తొలివచన కవిత' ఏవో నిరూపించిన రచయిత, 'వచన పద్యంలో పదగణాలు' అవి ఇంకో వ్యాసంలో వివరించడం బాగానే వుంది కాని ఆయనలో వచన కవిత్వాన్ని పద్యంగా ఎందుకు పేర్కొన్నాడో అర్థం కాదు. "రేడియో కవిత"లో సామాన్య శ్రోతలను ఎలా ఆకట్టుకోవాలో చెప్పిన రచయిత 'ఆధునిక సమాజంలో అవధాన కళ' ఎలా జనరంజకం కాగలదో వివరిస్తూ సాహిత్యంపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరించారు.

'ప్రథమ ప్రయోగకవి పఠాభి' అని నిర్ధారించినా, విప్లవ కవి చెరబండరాజు అని తెలియజేసిన రచయిత కుందుర్తి సాహిత వ్యక్తిత్వాన్ని, జాషువా కవితా హృదయాన్ని కూడా ఆవిష్కరించడం ఇతర వ్యాసాలలో కనిపిస్తుంది. దాశరథి 'కవితా పుష్పకము' శ్రీశ్రీ 'సినిమాపాటలు', నార్ల 'జగన్నాటకం'తో పాటు వారు రాసిన 'ఎలిజీ' నాగభైర నాగేశ్వరరావుగారి 'కవన విజయం' మొదలైన గ్రంథాల గొప్పదనాన్ని వివరించే వ్యాసాలు కూడా ఇందులో వున్నాయి.

"మాతృభాష - సౌందర్యం" "ఇది తెలుగు గడ్డ" "పిల్లలోకవితా చైతన్యం" అనే వ్యాసాలు రచయిత వృత్తిపరమైన జిజ్ఞాసకు తార్కాణాలు. "వార్త సాహిత్య ప్రక్రియ అవుతుందా?" అనే వ్యాసం చదువుతుంటే రచయిత సాహిత్యం - జర్నలిజానికి మధ్య వున్న తేడాను గుర్తించలేకపోయారని స్పష్టంగా తెలుస్తుంది.

స్పష్టత, క్లుప్తత ప్రధాన లక్షణాలుగా రూపొందిన ఈ వ్యాసాలలో రచయిత ఆసక్తి, తపన కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అయితే "పఠాభిపై ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సెక్స్ ప్రభావం చాలా వుంది" లాంటి స్టేట్‌మెంట్లు, 'మహారాష్ట్రలోని దళిత పాంథర్స్ సాహిత్య ఉద్యమం, అమెరికన్ నల్లజాతి సాహిత్యం యింకా దక్షిణ ఆఫ్రికా సాహిత్య ప్రభావం కూడా దళిత కవిత్వంపై ఉన్నట్లు విమర్శకులు భావిస్తున్నారు' లాంటి కప్పదాట్లు ఈ వ్యాసాలలో కనిపించడం విచారకరం. ఈ చిన్న చిన్న లోపాలను మినహాయిస్తే ఈ పుస్తకం పాఠకులకు ప్రాథమిక అవగాహన కలిగించడానికి, కొత్తతరం పాఠకులకు సాహిత్యం ముఖ్యంగా కవిత్వం పట్ల ఆసక్తిని కలిగించడానికి తోడ్పడతాయి.

- కె.పి.అశోక్‌కుమార్

రంగుల వెనుక జీవితం 'కవిత'

రంగుల ప్రపంచం ఎప్పుడూ వాస్తవికతకు దూరమైనదే. సినీ రంగంలో జీవిస్తున్న వారి జీవితాలు నరక కూపాలన్నది చాలా తక్కువ మందికి తెలుసు. కొంచెం పేరొచ్చిందంటే ఇమేజీ, డబ్బు కల్సి వొచ్చినా, వాటితో పాటే దిగజారిపోవాల్సి వుంటుంది. సినీమగరాయళ్ళకు ఎటువంటి లోటూ వుండదు. కాని హీరోయిన్ నుంచి లేడీ జూనియర్ ఆర్టిస్టు వరకు ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే దిగజారిపోవాల్సిందే. కఠోర వాస్తవాల్ని హృద్యంగా చిత్రీకరించిన నవల 'కవిత'. ఎస్.ఎమ్.ప్రాణ్‌రావు రాసిన ఈ నవల ఎక్కడా ఆగనీదు.

సినిమాటిక్‌గా కూడా లేదీనవల. సినిమాలకు కథలు, స్క్రిప్టులు రాసే ప్రాణ్‌రావు కమర్షియల్ నవలగా కాకుండా సాహిత్యవిలువలతో రాశాడు.

కవిత పేర్కొంది హీరోయిన్. ఆ స్థాయికి రావటానికి తానెంత కష్టపడ్డది, దిగజారిందీ చిత్రిస్తాడు. గాడ్‌ఫాదర్లు హీరోయిన్లని ఏ విధంగా చెప్పు చేతుల్లో పెట్టుకుంటారో చెప్పాడు. సిన్సియర్‌గా ఉత్తమ కళావిలువలతో ఆర్టు ఫిలింను నిర్మించాలనుకునే డైరెక్టర్నీ, తనలోని నటనని ప్రదర్శించాలనుకునే కవితను గాడ్‌ఫాదర్ ఎలా నాశనం చేసిందీ చిత్రిస్తాడు. నిస్సహాయ స్థితిలో తనను తాను కాల్చుకొని కవిత మరణిస్తుంది. సినీ నటీమణులెంత మంది ఆత్మహత్య చేసుకోలేదు. క్యాజువల్‌గా తీసుకొనే ఇటువంటి ఘటనలు 'కవిత' చదివాక కూచోలేము. నిలబడలేము. ఆలోచనకు గురవుతాము. మంచి టెక్నిక్కుతో సాగిన ఈ నవలలో 'నటన'లోని విలువైన అంశాల్ని చర్చించాడు. ఉత్తమ నటన ఎలా వుండాలో జడ్జి చేయగలిగే ప్రతిభను ప్రాణ్‌రావు కల్గివున్నారు. అందరూ చదవాల్సిన నవల 'కవిత'. కంగ్రాట్స్ ప్రాణ్‌రావ్!

- జిలుకర శ్రీనివాస్

శ్రీకారం



ఆర్టీసి కార్మికుల మైండ్ సెట్ మార్చాలని ప్రయత్నించిన ముఖ్యమంత్రి విఫలమయ్యారు. ముఖ్యమంత్రే మైండ్‌సెట్ మార్చుకోవాలని కార్మికులు స్పందించటంతో నాలుక కర్చుకున్నారు పాపం. 24 రోజుల పాటు సాగిన ఆర్టీసి కార్మికుల చారిత్రాత్మక పోరాటం వేతనాలు, మోటారు వాహనాల పన్ను తగ్గింపు, రాయితీల చెల్లింపుల విషయంలో మంచి విజయం సాధించింది. ఇందుకు ఆర్టీసి కార్మికులు, వారికి నాయకత్వం వహించిన జె.ఎ.సి., సంఘీభావం తెలిపిన ఇతర కార్మికులు, ప్రజానీకం అభినందనీయులు. సుదీర్ఘకాలం, గరిష్ట ఐక్యతతో పోరాడినందువల్లనే ఈ విజయం సాధ్యమైంది.

ఏపిఎస్ఆర్‌టిసిలో అపూర్వ సమ్మె
విలువైన అనుభవాలు
రచన : ఎస్.వీరయ్య, వెల : రూ.2/-,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఈ పుస్తకం ఆల్చిప్పల పెంపకానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని అందిస్తుంది. ముత్యాల పెంపకాన్ని చేపట్టడానికి అనుభవం కలిగిన కన్సల్టెంట్ శాస్త్రవేత్తల సలహా సంప్రదింపులు, గైడెన్స్ అత్యవసరం.

ముత్యాల పెంపకము
రచన : చిప్పగిరి జ్ఞానేశ్వర్, వెల : రూ.100/-,
ప్రతులకు : శ్రీమతి సి.విజయలక్ష్మి, డోర్ నెం.27-2-7/1, ప్రశాంతినిలయం, కలిదిండి వారి వీధి, భీమవరం; శ్రీమతి సి.అనసూయమ్మ, డోర్ నెం.7/205, ఫోర్ట్‌రోడ్, అనంతపురం

కవి అమ్మా నాన్నల కోసం చాలా కవితలు రాశారు. ఒక మాటలో చెప్పాలంటే తన జీవన నిర్మాతలకు ఈ విధంగా రుణం తీర్చుకోవాలనే బాధను వ్యక్తీకరించాడు.

శేషమంజరి
రచన : గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు
వెల : రూ.12.50, ప్రతులకు : జి.ఎల్.నరసింహారావు 2-1-566/బి/11, శంకర్‌మఠ్ ఎదురుగా, హైదరాబాద్ జి.రఘునాథ్, కొర్లపహాడ్, కేతేపల్లి మండలం, నల్గొండ

ప్రభాత భేరీలు మోగించిన మహిళాషాట్



'స్త్రీ' నాటికలో ఓ దృశ్యం

సమకాలీన సమాజంలో మహిళ ఎదుర్కొంటున్న సమస్యలకు దర్పణం పట్టాయి మహిళా షాట్ వీధి నాటికలు. నవంబర్ 24నుంచి 27వరకు విశాఖలోని ఉక్కునగరంలో జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆరవ జాతీయ మహసభల సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన మహిళా షాట్ వీధి నాటికలు స్థానికులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలను కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. భాష తెలియకపోయినా భావం వారిని కట్టిపడేసింది. సభల ప్రారంభంరోజైన 24న విశాఖనగరంలోని ఎల్లైసీ భవంతి ఆవరణలో విశాఖ జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు 'స్త్రీ', గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు 'ప్రశ్నించండి' వీధినాటికలను ప్రదర్శించారు. సభల మూడోరోజైన 26న ఉక్కునగరంలోని సిడబ్ల్యుసి గ్రౌండ్‌లో 'స్త్రీ', 'ప్రశ్నించండి' నాటికలతో పాటు నల్గొండ జిల్లా కళాకారులు 'బంజారా', 'తంగేడు పూలు' వీధి నాటికలను అద్భుతమనదగ్గ రీతిలో ప్రదర్శించారు. పుట్టి, పెరిగి, పెద్దై, పెళ్ళై మృత్యుదశకు చేరువయ్యేంతవరకు స్త్రీ సమస్యలను ప్రతిబింబించిన ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు సభలను మరింత పరిపుష్టం చేశాయి. ఇంట్లో తల్లితండ్రుల దగ్గర్నుంచి ప్రారంభమైన వివక్ష ఆట పాటల్లోను, చదువు సంధ్యల్లోను, విద్యాఉపాధిరంగంలోను తన వికృతరూపాలను ఎలా చూపిస్తుందో ఆవిష్కరిస్తుంది 'స్త్రీ' నాటిక. భూమిలేక భుక్తి కరువై నగరాలకు వలసలు పోతున్న బంజారాలు దోపిడీకి గురవుతున్న నేపథ్యాలను, పొట్ట నింపుకోవడం కోసం తమ కన్నపేగులను సైతం తెగనమ్ముకుంటున్న దీనగాథలను హృదయవిదారకంగా ఆవిష్కరిస్తుంది. కడుపులో పెరుగుతున్న పిండం ఆడపిల్లని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్న నేపథ్యాలను, బతికి బయిటపడ్డా వంటింటి కుందేళ్ళుగా మారిన వైనాలన్ని ఆవిష్కరించాయి. మరో పార్శ్వంగా విద్యా ఉపాధి రంగాల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపుతూ కొన్నేళ్ళ కిందట విశాఖ నగరంలో నర్సింగ్ విద్యార్థినులకు జరిగిన కన్యత్వ పరీక్షల హీనకృత్యాలను సైతం ఆవిష్కరించింది 'స్త్రీ' ప్రదర్శన. దైనందిన జీవితంలో మహిళలు ఎదుర్కొంటున్న బాధలూ, భయాలు, అధిక శ్రమ, వేతన వ్యత్యాసాలు, అత్యాచారాలు, వరకట్నవేధింపులు, అడుగడుగునా ఎదుర్కొంటున్న అసమానతలు తదితర సామాజిక ఆర్థిక రాజకీయ రుగ్మతలకు దర్పణం పట్టిన మహిళా షాట్ ఐద్వా ఆరవజాతీయ మహాసభల్లో చైతన్యకెరటమై ఎగిసింది. ఇటు నగరంలో ఉన్న సందర్శకులతో పాటు, అటు ఉక్కునగరంలో ఐద్వా ప్రతినిధుల హృదయలోతులను స్పృశించిన వీధి నాటికలు కళ లాగే స్త్రీ సమస్యలు కూడా విశ్వజనీనమని చాటాయి. అయితే ఒకటి మనస్సులను రంజింపచేస్తే మరోటి విషాదంలో ముంచెత్తుతుంది. కేవలం సమస్యలను ఎత్తి చూపడమే కాకుండా వాటికి పరిష్కారమార్గాలను కూడా చూపెట్టాయీ ప్రదర్శనలు. మహిళ తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకోవడానికి, క్షీణించిపోతున్న తన మనుగడను నిలబెట్టుకోవడానికి పోరాటాలే శరణ్యమని, అణిగి మణిగి పడి ఉండే సమయం ముగిసి ఉత్తుంగ తరంగాల్లా ఆకాశంలో సగభాగమైన స్త్రీలు, అభివృద్ధిలో సగభాగమైన మహిళలు ఉద్యమించాలని ప్రబోధిస్తాయి. ఆడది అబల అన్న రొడ్డకొట్టుడు సామెతలకు స్వస్తి పలికి పిడికిళ్ళు బిగించి ఒక ప్రబల శక్తిగా ఎదగాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతను చాటిచెప్పాయి. పురుషాధిక్యతతో పాటు రోజు రోజుకు పెరిగిపోతున్న రాజ్యహింసపై కూడా ఉవ్వెత్తున ఉద్యమించాలని కర్తవ్యాన్ని బోధిస్తాయి. 12ఏళ్ళు నిండగానే వయస్సు మీద పడిందన్న నెపంతో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న ఆంక్షల సంకెళ్ళను తెంచుకోమని చెబుతాయి. పెళ్ళి, పిల్లలు, సంసారం మాత్రమే స్త్రీ పరమావధి కాదని, ప్రపంచంలో సగభాగమైన మహిళ తనకు న్యాయంగా దక్కాల్సిన వాటా కోసం పోరాడాలని, అందుకు ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడరాదని మార్గదర్శకం చేస్తాయి. ఆడదై పుట్టడమే అవమానంగా భావించే స్థితిలోకి నెట్టబడ్డ పరిస్థితులను సవాల్ చేస్తూ ఇంతవరకు అణిగి మణిగి ఉన్న మహిళకు మేల్కొలుపులు పాడాయి మహిళా షాట్ ప్రదర్శనలు. ఆదిమ సమాజంలో, వేటల్లో, కుటుంబాన్ని పోషించడంతో పాటు అగ్రస్థానం వహించిన స్త్రీ కాలగమనంలో పితృస్వామ్యవ్యవస్థకు బానిసైన పరిస్థితుల్లోంచి బయటపడమని ప్రభాతభేరీలు మోగించిన మహిళా షాట్, ఐద్వా మహాసభలకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'ప్రశ్నించండి' నాటికలో ఓ దృశ్యం

- బి.అప్పలరెడ్డి



కర్రా ఎల్లారెడ్డి

మనలో చాలా మందికి జైలు లోపలి పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. కోర్టులో ఒక వ్యక్తి నేరం చేసినట్టుగా రుజువైతే ఆ వ్యక్తి చేసిన నేరాన్ని బట్టి న్యాయమూర్తి జైలు శిక్ష విధించడం జరుగుతుంది. కావాలని లేక అనుకోని పరిస్థితుల్లో నేరం చేసిన పురుషులు, స్త్రీలు, నాయకులు, గూండాలు ఎవరైనా సరే వారి నేరం కోర్టులో రుజువైతే వారికి శిక్ష పడుతుంది. వారు న్యాయమూర్తి విధించిన శిక్షా కాలాన్ని జైలులో ఉండి పూర్తి చేయాల్సి ఉంటుంది.

జైలు లోపలి జీవితం ఎలా ఉంటుందో ఈ వారం 'జైలుకథ' తెలుపుతుంది.

ఖైదీలకు, కారాగాలకు వర్తించే శాసనాన్ని 1894లో రూపొందించారు. ఈ చట్టంలోని సెక్షన్‌ల ప్రకారమే జైలు పరిపాలన నడుస్తుంది. ఈ చట్టానికి లోబడి రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నిబంధనలను రూపొందిస్తాయి. ఖైదీల ఆహారం, దుస్తులు, వైద్యం, క్రమశిక్షణ మొదలైన విషయాలకు సంబంధించి రూల్స్ ఉంటాయి. ఈ విధమైన జైలు నిబంధనల సంపుటిని "జైలు మాన్యువల్" అంటారు.

జైలు మాన్యువల్‌ను జైలు డిపార్ట్‌మెంట్ వారు తయారు చేసి ముద్రిస్తారు. చాలా కాలం వరకు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు విడివిడిగా జైలు నిబంధనలు ఉండేవి. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన చాలా కాలం తర్వాత రెండు ప్రాంతాల జైలు నిబంధనలను సమన్వయ పరచి రాజమండ్రి, విశాఖపట్టణం జైళ్ళకు తయారు చేసిన నియమావళినే తెలంగాణాకు కూడా వర్తింపు చేశారు.

జైళ్ళలోని బందీలకు కొన్ని ప్రాథమిక హక్కులు వున్నాయి. వీటిలో ముఖ్యమైనవి - తమ కేసులో అప్పీలు చేసుకునే హక్కు, పత్రికలు చదవడానికి సౌకర్యం, ప్రాథమిక విద్యను నేర్చుకునే అవకాశం, బంధువులు, స్నేహితులతో కలిసి మాట్లాడే అవకాశం, జబ్బు చేసినప్పుడు ప్రత్యేక ఆహారం పొందే హక్కు మొదలైనవి. ఇంకా చాలా ఉన్నాయి.

ఖైదీలు ఏ, బి, సి అనే మూడు తరగతులుగా వారి స్థాయిని బట్టి విభజించబడి ఉంటారు. సమాజంలో పేరు ప్రతిష్టలు, ఆర్థిక ప్రతిపత్తి, అధికార హోదా వున్న వారిని ఏ, బి తరగతుల్లో ఉంచి మంచి సౌకర్యాలు వారికి కల్పిస్తారు. అయితే ఎక్కువ మంది ఖైదీలు సి తరగతిలోనే ఉంటారు. కనుక వారికి సంబంధించిన విషయాలను మాత్రమే ఇక్కడ రాయటం జరుగుతోంది. సామాన్య ఖైదీలకు ఉండే హక్కులు, సౌకర్యాలు...

ఖైదీలు తమ విధులను పాటించాల్సి ఉంటుంది. వారు జైలు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. ఖైదీలలో ఎవరు ఏ పనిని సమర్థవంతంగా చేయగలిగితే వారికి అదే పనిని జైలు సిబ్బంది అప్పగిస్తారు. ఉదాహరణకు చాకలికి బట్టలు ఉతికే పని, మంగలికి జుట్టు కత్తిరించే పనిని అప్పగిస్తారు. ఒక రకంగా చూస్తే దీనివల్ల 'కులతత్వం' జైలులోనూ కొనసాగుతోంది. ఎందుకంటే ఖైదీలు ఎవరైనా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు చెందిన వారైతే, వారికి శూద్ర కులాలకు చెందిన పనులను అప్పగించరు. ఈ విధమైన కుల వివక్షను అందరూ నిరసించాలి.

జైలు వారిచ్చిన ఆహారాన్నే ఖైదీలు భుజించాలి. జైలు అధికారుల ఉత్తర్వుల ప్రకారం జైలు ఆఫీసర్ల ఇళ్ళను శుభ్రపరచటం, నీళ్ళు తోడటం, చెత్తా చెదారం తొలగించటం ఖైదీల విధులు. ఒకవేళ న్యాయమూర్తి ఎవరికైనా కఠిన శిక్ష అని తీర్పులో రాస్తే ఆ ఖైదీ శ్రమించి పని చేయాల్సి ఉంటుంది. సాధారణ శిక్ష లేక కఠిన శిక్ష అని వారు పేర్కొంటారు.

ఖైదీలకు చాలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. జైలు అధికారులు నిర్ణయించిన మేరకు పుస్తకాలు, వార్తా పత్రికలను చదవవచ్చు. 15 మంది ఖైదీలకు కలిపి ఒక దినపత్రిక కేటాయిస్తారు. 40 మంది బందీలకు కలిపి ఒక ఇంగ్లీషు పత్రికను ఇస్తారు. సాయంత్రం ఆరున్నర నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వినోద, విజ్ఞాన కార్యక్రమాల్లో ఖైదీలు పాల్గొనవచ్చు. రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు చదువుకోవచ్చు. బందీలకు మత పెద్దలచేత బోధతో కూడిన ప్రసంగాలను ఇప్పిస్తారు. వారు మాత్రం ఖైదీల మతం మార్పించే ప్రయత్నాలు చేయరాదు. వారానికి ఒకసారి డాక్టరు వచ్చి ఖైదీలను పరీక్ష చేస్తాడు.

ఖైదీలు తమ బంధువులు, స్నేహితులు, న్యాయవాదులతో సమావేశమై తమ విషయాలను చర్చించుకునే అవకాశం ఉంటుందది. ఈ అవకాశం 14 రోజులకు ఒకసారి మాత్రమే ఉంటుంది. వారు నెలకు రెండు ఉత్తరాలు రాసుకోవచ్చు. వాటిలో స్వంత విషయాలు, కుటుంబ విషయాలను మాత్రమే రాయాలి. ఒక జైలు నుంచి మరో జైలుకు మారినప్పుడు ఆ విషయాన్ని ఖైదీలు తమ స్నేహితులు, బంధువులకు తెలియచేయవచ్చు. ఒక ఖైదీ తన స్నేహితుడు లేక తన లాయర్‌తో అరగంట సేపు మాట్లాడే అవకాశం కల్పిస్తారు. ఉత్తరాలు రాసినా, ఇతరులతో మాట్లాడినా స్వంత విషయాలకే పరిమితం కావాలి.

ఖైదీల శిక్ష తగ్గింపు విషయంలో కొన్ని నిబంధనలకు లోబడి శిక్షాకాలం కంటే ముందే వారిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. కోర్టు విధించిన

శిక్షలో నాలుగింట మూడు వంతులు అనుభవిస్తే లేక రెండు సంవత్సరాల పైగా జైలు శిక్ష అనుభవిస్తే అతని కేసును విడుదల కోసం సిఫార్స్ చేస్తూ సలహా సంఘానికి పంపిస్తారు.

'జీవిత ఖైదు' అంటే 20 సంవత్సరాల ఖైదు అని అర్థం. ఈ శిక్షలలో 12 సంవత్సరాలకు పైగా శిక్ష అనుభవిస్తే అతని కేసును విడుదల కోసం సలహా సంఘానికి నివేదిస్తారు.

ఎవరైనా ఖైది తోటి ఖైదీలతో తగాదా పడటం, జైలు వస్తువులను దాచటం, జైలు అధికారులను అగౌరవ పరచటం, అబద్ధాలు చెప్పటం, హింసకు పాల్పడటం మొదలైనవి నేరాలుగా పరిగణిస్తారు. వీటికి జైలు అధికారులు స్వయంగా శిక్షలు విధిస్తారు. ఖైదీ మరో నేరం చేస్తే దానికీ శిక్ష ఉంటుంది.

జైళ్ళలో మహిళలకు ప్రత్యేక హక్కులు, సదుపాయాలు ఉంటాయి. మహిళా ఖైదీలకు వారి ప్రాంగణం ఆవల పని చెప్పరు. బాలికలకు, మహిళలకు వంట చేయటం, దంచడం, పొట్టు తీయడం వగైరా పనులు అప్పగిస్తారు.

మహిళా ఖైదీలకు సంకెళ్ళు వేయరాదు. జైలులో ప్రవేశించగానే వారికి రెండు చీరెలు, రెండు లంగాలు, రెండు రవికలు, రెండు దుప్పట్లు, ఒక తువ్వాలు ఇస్తారు. అయితే మహిళా ఖైదీలు బహిరంగ జైలులో ఉండే అవకాశం లేదు. అలాంటి జైళ్ళు కూడా లేవు. టాయిలెట్లను శుభ్రం చేసే పనిలో వారిని నియోగించరాదు.

జైలు లోపలి ఖైదీలకు చాలా వరకు వారి హక్కులు గానీ, వారికి కల్పించే సౌకర్యాలు గానీ తెలియవు. జైలు అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారి పైఅధికారులకు తెలియజేయగలగాలి. అందుకే మనం ఖైదీల హక్కులు, విధుల గురించి తెలుసుకొని వారికి పరోక్షంగానైనా మద్దతు తెలిపితే ఈ "జైలు కథ" ప్రయోజనం నెరవేరినట్లే. ★

హిరణ్యాక్షుడు

(19వ పేజీ తరువాయి)

కారణాలుండి వుంటాయి... కాని తన కన్నీ తెలుసనుకుంటుంది.. ఆమెకెన్ని విధాలుగా చెప్పినా ఒక్క విషయాన్నీ చెవిని పెట్టడం లేదు. ఆమెను మార్చడానికి నా ప్రయత్నాలను మాత్రం మానుకోలేదు.

"విమలా...! మన పెళ్ళయింతర్వాత మనమిద్దరమూ చదువులో వున్నత డిగ్రీలు సంపాదించుకున్నాం.. డబ్బూ ఓ తీరుగానే సంపాదించుకున్నాం... రచయితగా మన కుటుంబానికి గౌరవమూ పెరిగింది... అయినా నీకీ అసంతృప్తెందుకు...? పుస్తకాలు చదవడం మానుకొని టీవీలకు అతక్కుపోవడం వల్ల మధ్య తరగతిలో ఒత్తిడి పెరిగిందని ఓ పరిశోధనలో తేలింది... నీ విషయంలోనూ అదే జరిగుంటుంది... అంతే కాకుండా ఈ సమాజాన్ని కబళించడానికి పెద్ద పెద్ద కోరలతో ప్రవేశించిన ఆ రాక్షసుడు నిన్ను బాధిస్తున్నాడు... దయ చేసి విషయాన్నర్థం చేసుకో... నీకింతకంటే చెప్పడం కుదరదు...

నా మాటలు ఆమె మీద ఏ మాత్రం ప్రభావం చూపలేదు..

"రాక్షసుడంటూ ఏదేదో అంటూ నన్ను పిచ్చిదాన్ని చెయ్యకండి... పి.జి.లు, డాక్టరేట్లు, రచనలు చేయడం వల్ల మీరు సంపాదించిందేముంది. మీ కంటే ఓ మెట్రిక్‌లేట్, వట్టి డిగ్రీ వ్యక్తి ఎన్నో రెట్లెక్కువ సంపాదించాడు.. గౌరవమేమన్నా కూడు పెడుతుందా? ఏ పని చేసినా అందువల్ల సంపాదనుండాలి కాని పేరు ఏం చేసుకోను? మీ రచనలకుపయోగించే సమయాన్ని ఇతరత్రా సంపాదించడానికుపయోగిస్తే ఎంత సంపాదించే వారు..! రచయితట... గౌరవమట.. డబ్బుంటేనే గౌరవం..."

విమల మాటలు నాతల మీద నల్లసరం బండతో బాదినట్టే వున్నాయి... మొదట్లో నన్ను రాయమంటూ ప్రోత్సహించిన విమల ఇప్పుడిలా అనటం నాకు బాధాకరంగానే ఉంది... అప్పుడర్థమయింది విమల నన్ను రచయితగా చంపడానికి చేసిన ప్రయత్నాలు..

నా కళ్ళవెంట టపటపాఆ నీళ్ళు కారుతున్నాయి... నన్నునన్నుగా ప్రేమించిన విమల ఆ రాక్షసుడి మాయలో పడి నా పక్కనే వున్నా నాకు దూరమై పోతుండటం నన్ను వెక్కి వెక్కి ఏడ్చేట్టు చేస్తున్నాయి..

విలువలను గాలికొదిలి డబ్బు సంపాదించాలన్న విమల మాటలు నన్నామెకు దూరం జరుపుతున్నాయి.. మేం కలిసి బతుకుతున్నాం తప్ప కలిసి జీవించడం లేదు.

మా శరీరాలు కలుసుకుంటున్నాయి కాని ఆ కలయికలో ఏ స్పందనా లేదు.. అభిప్రాయాల్లో సమాంతర రేఖలు స్పర్శలో స్పందనెలా ఉంటుంది...?

నేను నీకెంత ప్రేమానురాగాల నిచ్చానంటే అవేమన్నా తినేవా అంటే ఆ భార్యాభర్తల బంధానికర్థమేంటి...

యాంత్రికత... పూర్తి యాంత్రికత.. పైకి కనబడని యాంత్రికత... మేం తాకుతున్నా అందులో పరవశం లేదు.. ఓ ఫైల్ మీదనో, ఓ వస్తువు మీదనో చెయ్యేసినట్టే ఉంది.. ఇంత యాంత్రికంగా కాపురం చేయడం ఆత్మవంచనే కదా...! నాకు అరవాలనిపిస్తుంది. మొత్తుకోవాలనిపిస్తుంది... లబోదిబోమని కొట్టుకోవాలనిపిస్తుంది...

ఇది నా కథ... మా కథ...

ఇప్పుడు చెప్పండి... ఒక్క టీవీ పగులగొడితేనే సరిపోతుందా...? నాకైతే ఇంకా ఏవేవో చేయాలనిపిస్తుంది. ఈ సోఫాసెట్టును తుక్కు తుక్కు చేయాలనిపిస్తుంది. ఆ గ్లాసు బీరువాను ముక్కలు ముక్కలు చేయాలనిపిస్తుంది. విలువైన విలాస వస్తువులనన్నిటినీ నుగ్గు నుగ్గు చేయాలనిపిస్తుంది... ఇంకా... ఇంకా... ఎన్నో చేయాలనిపిస్తుంది... వద్దంటారా మరి...?"

చెప్పడం ముగించాను...

మా ముగ్గురి హృదయాలు భారమయ్యాయి.. మా ముగ్గురి నాసికాపుటాల నుండి దీర్ఘ నిట్టూర్పులు వెలువడ్డాయి.

"మహిపాల్...! రాజేందర్‌రెడ్డీ...! ఇప్పుడర్థమయిందా నా విమలను నాకు దూరం చేసిందెవరో...? మా మధ్య ఎడాన్ని శత సహస్ర యోజనాలు పెంచిందెవరో...? వాడే.. వాడే.. ఆ రాక్షసుడే.. భూమినంతా చాపచుట్టినట్టు చుట్టి సముద్రంలో దాక్కున్నాడని చదివామప్పుడు... ఆ హిరణ్యాక్షుడే మన సమాజంలోకి ప్రవేశించాడు.. విలువలు, మానవాంశాలను మటుమాయం చేస్తున్నాడు... భూగోళమంతా డబ్బు చుట్టే తిరగాలని ఆదేశిస్తున్నాడు.. భాష, సంస్కృతులు, నాగరికతలను మటుమాయం చేసి మూస ప్రపంచాన్ని తయారు చేయాలని చూస్తున్నాడు.. అనేక రకాల ఏజెంట్లను పంపాడు... ఆ రాక్షసుడొచ్చిం తర్వాతే నా విమల నాకు కాకుండా పోతుంది... మీరూ ఆ హిరణ్యాక్షుని ఏజెంట్లవుతారా...? చెప్పండి.. చెప్పండి..."

అరచినట్టన్నాను...

"హిరణ్యాక్షుడంటే ఏంటో అనుకున్నాను.. నేనూ వాడి బాధితుడినే కైలాసం... నువ్వు చెప్పిన దాంట్లో సగమైనా నాకున్నాయి..."

అన్నాడు మహిపాల్...

"నేనూ అంతే... ఇరవై ఏళ్ళు అష్టకష్టాలు పడి సంపాదించిన నా సంపాదనను అతి తేలికగా తీసేస్తుంది నా భార్య.. నిజమే మాలాగ ఎంతోమంది తెలిసీ తెలియక వాడికి ఏజెంట్లుగా వకాలత్ తీసుకుంటున్నారు..." అన్నాడు రాజేందర్ రెడ్డి..

"అయితే డబ్బు బాగా సంపాదిస్తే చాలు అక్రమ సంబంధాలున్నా ఫర్వాలేదని విమలతో అనిపించిన హిరణ్యాక్షుడికి నా కృతజ్ఞతలు.. నేను సంపాదించే పద్ధతిలో నా దగ్గర విమల కోరుకున్నంత డబ్బు పోగైతే నేనెలా తిరిగినా తప్పించుకోవడానికి సాకు దొరుకుతుంది..."

"బావా...! మీరు డబ్బు సంపాదించగలరేమో కాని అలాంటి వెధవ పనులు చచ్చినా చేయరు... అలా చేస్తే మీరూ ఆ హిరణ్యాక్షుడి ఏజంటన్నట్టే కదా...! మీ మాటలన్నీ బయట నిల్చొని చాలాసేపట్నుంచి వింటున్నాను.. నేను కూడా ఆ బాధితుల్లో ఒకణ్ణే..." లోపలికొచ్చి కూర్చుంటూ అన్నాడు నా బావమరిది..

"ఆ హిరణ్యాక్షుని బారి నుండి మనల్ని మనం రక్షించుకోవడమెలా...? ఆ రాక్షసున్నెదుర్కోవడమెలా...?"

"అతని బారి నుండి భూగోళాన్ని రక్షించడమెలా...? లేకుంటే భవిష్యత్తులో వచ్చేది కుక్కమూతి పిందెలే.. థెరిస్సాలు, గాంధీలు రానే రారు.. మహాఅయితే బిల్‌గేట్లు, ప్రేమ్‌జీలు రావచ్చు..."

"ఏముంది..? మనమంతా వరాహావతారాలెత్తడమే..." అన్నాను నేను...

"అంతే... అంతే... అన్నారంతా...

అయితే బలవంతుడైన హిరణ్యాక్షుణ్ణెదుర్కొనే వరాహమూర్తుల స్వరూప స్వభావాలు, జవసత్వాల గూర్చి ఆలోచిస్తూనే వున్నాను... నిరాశ మాత్రం ఎదురు కాలేదు నాకు...

(సమాప్తం)

కొండబాబు

పూజ్యులైన బావగారికి

నమస్కారములు. ఉభయకుశలోపరి. ముఖ్యముగా వ్రాయునది ఏమనగా, మా కుమార్తె, తమ కోడలును అయిన చి॥ల॥సౌ॥ సుజాత లక్ష్మివారం ఉదయం 10 గం॥ 45 ని॥లకు నీళ్ళోడినది. సుఖ ప్రసవమే. మగపిల్లవాడు. తల్లీ బిడ్డా క్షేమము. వచ్చే శనివారం నాడు స్నానం. అల్లుడు గారూ, మీరూ, మా చెల్లెలు గారూ యావన్మందీ రాగలందులకు ఈ ఉత్తరము ద్వారా ఆహ్వానిస్తున్నాను. అందరినీ అడిగినట్లు చెప్పగలరు.

ఇంతే సంగతులు

ఉంటాను.

తాజా కలం: పిల్లవాడి పేరును జన్మ నక్షత్రంతో నిమిత్తం లేకుండా ఆధునికంగా పెట్టాలని తమ కోడలంటున్నది.

ఇట్లు

– తాళ్ళూరి సుబ్బ రామయ్య

ఉత్తరం చదవడం పూర్తి చేసిన వెంకట్రామయ్య ఆనందంతో కేక పెట్టారు. "భాగ్యం., మనకు మనవడు పుట్టాడు" అంటూ

★ ★ ★

నీలాటి రేవు ...!



ఈ మధ్య ఫోన్లు, సెల్‌ఫోన్లు పెరగడంతో ఇలాంటి ఉత్తరాలు అరుదయ్యాయి. కానీ ఇప్పటికీ ఉత్తరాలపైనే ఆధారపడుతున్న పల్లెలు, ప్రజలు లక్షలు లక్షలు. మన చర్చ ఉత్తరాయణాల గురించి కాదు. సుబ్బరామయ్య గారు రాసిన ఉత్తరంలోని పదం గురించి. 'నీళ్ళోడటం' అనేదే ఆ పదం.

నీళ్ళోడటం అంటే ప్రసవించడమనే ఎవరికైనా తెలుసు. స్నానం చేసి వస్తాను అని చెప్పడానికి 'నీళ్ళోడి వస్తాను' అని చెపితే నవ్వుతారు. కానీ నీరాటి రేవు, నీలాటి రేవు అనే పదాల్లో మాత్రం స్నానఘట్టమనే అర్థమే స్ఫురిస్తుంది.

నిఘంటువుల్లో కూడా నీరాట, నీరాటము (నీరు+ఆట=స్నానం) నీరాడు=జలకమాడు అనే అర్థాలే కనిపిస్తాయి.

నీళ్ళాడు అంటే స్నానం చేయడమనే అర్థంలోనే భారతంలో తిక్కన ప్రయోగించారు.

"అతడు సర్వతి నవగాహనము సేయు
చుండి యా చెరువ గోర్తు తడుపు
గట్టక నీళ్ళాడగా జూడదనదు
శుక్తము నార్గమించిన.."

మార్కండేయ పురాణంలోనూ –

.... దిగాంబ
రాత శయనింపనీరాడగాదు"

శుకసప్తతి గాథల్లోనూ

"సాక్షాత్కరించిన జలదేవత యనంగ
నీరాట రేవున నీట చూపు"

అని పేర్కొన్నారు.

కదలికనూ, క్రియనూ తెలిపే 'ఆడు' అనే మాటతో నీరాడు, నీళ్ళాడు అనే ఈ పదం స్నానించడంగా ఉంది. ప్రసవించడమనే అర్థం దిని నుంచే పుట్టిందనుకున్నాం. అది ఎలా? అన్నదే చర్చ.

ప్రస్తుతం రోజూ రెండుపూటలా స్నానం చేయడం పద్ధతిగా ఉంది. కానీ పూర్వం ఎప్పుడోగాని స్నానం చేసేవారు కాదు మన పూర్వీకులు– వాళ్ళంతా అసహ్యంగా ఉన్నప్పుడేమో! ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఒక పూట స్నానం ఉండగా, కొన్ని గిరిజన ప్రాంతాల్లో ఎప్పుడోగానీ స్నానం చేయని పద్ధతి కొనసాగడం చూస్తూనే ఉన్నాం కదా!

రోజూ స్నానం చేయని పూర్వపు రోజుల్లో వాళ్ళంతా ఇబ్బందికరంగా ఉండే ప్రత్యేక సందర్భాల్లో తప్పనిసరిగా స్నానం చేసేవారు. అలాంటి ప్రత్యేక, ప్రధాన, ప్రముఖ సందర్భమే ప్రసవం. ప్రసవించిన స్త్రీ శరీరం అలసట చెందే కాక, రాక్యం–మావి, మొదలైన వాటితో వెంటనే స్నానం చేయాలనిపించే పరిస్థితితో ఉండేది. కాబట్టి కచ్చితంగా స్నానం చేయించేవారు. దీంతో ఎప్పుడూ అనివార్యత లేక, ఆ సందర్భంలో అవశ్యంగా ఉన్న స్నానానికి (నీళ్ళోడటం) ప్రత్యేకత ఏర్పడి అదే ఆ సందర్భపు 'క్రియ' అయి కూర్చుంది.

ఒకప్పుడు 'ఫస్ట్ క్లాస్ వచ్చిందా?' అని అడిగే వాళ్ళు విద్యార్థులను. ఇప్పుడు 'క్లాస్ వచ్చిందా?' అని అడుగుతున్నారు– ఫస్ట్‌క్లాస్ గురించే. నీళ్ళోడటమూ అలాగే క్రమేణా విశేష అర్థాన్ని సందరించుకుంది. ★

పాఠక స్పందన

మేజర్ జీవితం ఆదర్శం

16-12-2001 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన 'మేజర్ నుండి గెరిల్లా దాకా...' చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడిచింది. మేజర్‌జైపాల్ సింగ్ ఎన్నో సౌఖ్యాలను వదులుకొని భాష తెలియని రాష్ట్రంలోకి వచ్చి అందించిన సహాయం ఎంతో ఆసక్తిదాయకంగా సాగింది. తుది శ్వాస విడిచే వరకూ కమ్యూనిస్టు పార్టీకి ఆయన అందించిన సేవలు అపూర్వం. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకం. అలాగే హిరణ్యాక్షుడు కథ నేటి వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేదిగా వుంది.

– నాగ శిరీష, హైదరాబాద్

చిత్తశుద్ధి లోపించిన పాలకులు

డిసెంబర్ 9వ తేదీ ఆదివారం ప్రజాశక్తిలోని కవర్ స్టోరీ 'ముంగిట్లో ధాన్యం – కళ్ళల్లో దైన్యం' ఆంధ్ర రైతన్నల సమస్యలకు అద్దం పట్టింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించినప్పుడు ప్రజల సమస్యలకు పరిష్కారం లభించదు. పుస్తక పరిచయం డాక్టర్ పి.శ్రీదేవి గారి కాలాతీత వ్యక్తులు గురించిన సమీక్ష బాగుంది. బాలనేస్తాలు శీర్షికలో బాలల మెదళ్ళకు మేతపెట్టే శీర్షికలను ప్రవేశ పెట్టడం అవసరం.

– ఆనందగజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళం జిల్లా

పాఠకుల్ని చైతన్య పరుస్తున్న అనుబంధం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం ప్రతిసారీ కొత్తదనాన్ని సంతరించుకొంటోంది. మనలో మాట పాఠకుల అంతరంగాలను చూసుకొనేలా సాగుతోంది. ప్రజాశక్తి మరింత మంది పాఠకుల చెంతకు చేరాలని ఆశిస్తున్నాను.

– ఆరసవిల్లి కృష్ణ, విజయవాడ


Decora
USHA®
The undisputed leader in fans.
డివిజనల్ ఆఫీసు : ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్, 13/2 రసూల్‌పుర, సికింద్రాబాద్-500003, ఫోన్స్ : 7904873, 7903513,
ఫ్యాక్స్ : 040-7901285. బ్రాంచి ఆఫీసు : 69-1-3, పటమట, విజయవాడ, ఫోన్ : 481538. కంపెనీ షోరూంలు : హైదరాబాద్ - కోటి,
ఫోన్ : 4745694, దిల్‌షుక్‌నగర్-ఫోన్ : 4069589, విజయవాడ - ఫోన్ : 563636, విశాఖపట్టణం-ఫోన్ : 502377,
సర్వీస్ సెంటర్లు : హైదరాబాద్ ఫోన్ : 6316661, విజయవాడ-ఫోన్ : 433127, విశాఖపట్టణం-ఫోన్ : 725220.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన రైతువాణి

సంవత్సర
చందా
రూ॥ 100/-
మాత్రమే

ఆధునిక పద్దతులలో వ్యవసాయం, మారుతున్న పరిస్థితులను ప్రతి నెల రైతులకు అందిస్తున్న పత్రిక మన రైతువాణి.
పత్రికకు చందా దారులు కండి 2002 మన రైతువాణి డైరీ, క్యాలెండర్ పొందండి.

వ్యవసాయ రంగ సంక్షోభానికి, రైతు నష్టాలకు కారణాలను విశ్లేషించి పరిష్కారాన్ని చూపేది మన రైతువాణి పత్రిక
డిసెంబర్ లోగా చెల్లించిన చందాదారులకు మాత్రమే ఈ అవకాశం

సంవత్సర చందా రూ॥ 100/-

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతుసంఘం కార్యాలయాలలో గాని చెల్లించి 2002 డైరీని, క్యాలెండర్‌ను పొందండి. పోస్టు ద్వారా పొందగోరువారు రూ. 136/-లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్ నగర్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక